

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 28-04-2026 | సంపుటి - 27 | సంచిక -336 | రూ : 4 | పేజీలు: 8

## డ్రగ్స్ కేసుల్లో ఎంతటివారినైనా వదలొద్దు!

- ప్రతి సంక్షేమ కార్యక్రమంలో మహిళలకే అగ్రస్థానం
- మహిళ రక్షణకు 'స్పందన' కార్యక్రమం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

2లో






## రెండున్నర ఏళ్లలో వ్యవస్థల్ని కుప్పకూల్చారు

- రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తం
- వచ్చే ఎన్నికల్లో గెలిచేది భారాసనే
- భాజపాది మనువాద సిద్ధాంతం... కావాలనే మహిళా బిల్లు వీగిపోయేలా చేశారు
- పార్టీ రాష్ట్ర కమిటీ మినహా.. మిగతావి రద్దు
- ముఖాలు చూసి టికెట్లు ఇచ్చేది లేదు
- పక్షం రోజుల్లో సభ్యత్వ నమోదు
- తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ సైన్యాన్ని తయారుచేద్దాం
- భారాస పార్టీ రజతోత్సవ ముగింపు కార్యక్రమంలో కేసీఆర్ పిలుపు

2లో

## 'స్కాం'బోడియా.. సైబర్ ముఠాల అడ్డా!



2లో

- దేశంలో 3.5 లక్షల మంది సైబర్ బాధితులు
- వారి అండతో రూ.లక్షల కోట్లు కొల్లగొట్టిన నేరగాళ్లు
- దోపిడీ సొమ్ము కంబోడియా జీడీపీలో 40 శాతానికి సమానం
- భారత్ బాధితులు కోల్పోయింది రూ.22,495 కోట్లు



## తెలంగాణ అభివృద్ధికి పునరంకితమవుదాం


- భారాస ఆవిర్భావ దినోత్సవంలో కేటీఆర్

హైదరాబాద్: కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి కోసం మరోసారి పునరంకితం అవుదామంటూ పార్టీ శ్రేణులకు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపునిచ్చారు. భారాస ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. భవన్‌లో పార్టీ జెండాను ఎగురవేశారు. జయశంకర్ విగ్రహానికి, అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. ''సరిగ్గా 25 సంవత్సరాల క్రితం త్యాగాల పునాదుల మీద భారాస(అప్పటి తెరాస) ఆవిర్భవించింది. కొండా లక్ష్మణ్ బాపూజీ ఇచ్చిన ఆశ్రమం జలదృశ్యంలో జెండా ఎత్తారు కేసీఆర్.

## హర్మ్యూజ్ తెరుస్తాం కానీ..!

- రెండు షరతులకు అంగీకరించాలి
- తెరపైకి ఇరాన్ కొత్త ప్రతిపాదనలు
- గతంలో కంటే మెరుగ్గా ఉన్నాయని ట్రంప్ వ్యాఖ్య
- పాక్ నమ్మదగ్గ మధ్యవర్తి కాదు: ఇరాన్ ఎంపీ

దుబాయ్/మాస్కో: అమెరికాఇరాన్ మలి విడత చర్చలపై అనిశ్చితి నెలకొన్న వేళ.. కొత్త ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. హర్మ్యూజ్ జల సంధిని తెరుస్తామని, నౌకల ప్రయాణాలకు అనుమతులిస్తామని ఇరాన్ ప్రతిపాదించింది. అందుకు రెండు షరతులను విధించింది. ఒకటి.. హర్మ్యూజ్ జల సంధి దగ్గర కొనసాగిస్తున్న నౌకాదళ దిగ్బంధనాన్ని అమెరికా ఎత్తి వేయాలి. రెండోది.. అణు కార్యక్రమానికి సంబంధించిన చర్చలను జల సంధి తెరిచిన తర్వాతే కొనసాగించాలి. ఈ మేరకు ప్రతిపాదనలను మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్ ద్వారా అగ్ర రాజ్యానికి ఇరాన్ పంపినట్లు తెలుస్తోంది. దీనిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తరువాయి 2లో



## ప్రపంచ సవాళ్లకు పరిష్కార వేదికలుగా వర్సిటీలు

- పరిశోధన కేంద్రాలుగా అభివృద్ధి చెందాలి
- ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్
- వైభవంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవం

2లో





## భాజపా సర్కారు ప్రమాణ స్వీకారానికి వస్తా

- బెంగాల్లో అధికారంపై మోదీ ధీమా

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా విజయం సాధించి తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తీరుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. వచ్చే నెల 4 తర్వాత తమ పార్టీ ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవానికి తాను తిరిగి రాష్ట్రానికి వస్తానని పేర్కొన్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బ్యారక్‌పుర్‌లో సోమవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడారు. పశ్చిమ బెంగాల్‌లో సిండికేట్ రాజ్‌కు టీఎంసీ తరువాయి 2లో

## ఇంధన మంటల పాపం ఐఓసీఎల్‌దే

- వాణిజ్య అవసరాలకు మళ్లిస్తున్నారంటూ సరఫరాలో పరిమితులు
- అప్పటి నుంచే దెబ్బతిన్న సరఫరా
- రాష్ట్రంలో డీజిల్ కొరతకు ప్రధాన కారణం ఇదే
- ఇంధన సరఫరా కంపెనీల మాటల్ని గుడ్డిగా నమ్మిన పౌరసరఫరాలశాఖా దోషే



2లో

# డ్రగ్స్ కేసుల్లో ఎంతటివారినైనా వదలొద్దు!

హైదరాబాద్: మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడేవారిలో 80% మంది మత్తుకు బానిసలై, మానసిక స్థితి సరిగా లేనివారే ఉంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఏ దేశాల్లో పిల్లలు, మహిళలకు రక్షణ కల్పిస్తున్నారో అక్కడే అభివృద్ధి వేగంగా జరుగుతోందన్నారు. అందుకే తమ ప్రభుత్వం మహిళల కోసం షీటీంలను ఏర్పాటు చేసిందని, అభద్రతకు గురైన వారికి అండగా ఉండేందుకు స్టాండ్ విత్ హర్ కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి మహిళలకు ఎప్పుడు, ఏ కష్టమొచ్చినా అందుబాటులో ఉండేలా స్పందన బృందాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. నగర పోలీసులు మహిళలుచిన్నారుల భద్రతకు ప్రత్యేకంగా రూపొందించిన 'స్పందన ఆల్ ఉమెన్ ఫస్ట్ రెస్పాండర్ సిస్టమ్' బృందాలను బంజారాహిల్స్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. డీజీపీ శివధర్‌రెడ్డి, మంత్రి సీతక్క, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, నగర సీపీ సజ్జనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'మహిళలు, పిల్లల భద్రతపై సందేశం, డ్రగ్స్ మూలాలు పెకిలించాలని పోలీసు అధికారులకు ఆదేశం ఇచ్చేందుకే ఈ కార్యక్రమానికి వచ్చాను. ప్రధాని, లోక్‌సభ స్పీకర్, గవర్నర్లుగా మహిళలకు కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇచ్చింది. చట్టసభల్లో మహిళల రిజర్వేషన్ల బిల్లుకు 2013లోనే ప్రతి సంక్షేమ కార్యక్రమంలో మహిళలకు అగ్రస్థానం ఇస్తున్నాం. 67 లక్షల మంది స్వయం సహాయ సంఘాల్లోని మహిళలకు రూ.60 వేల కోట్ల బ్యాంకు రుణాలు అందజేశాం. కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశాం. గత 28 నెలల్లో మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి రూ.10 వేల కోట్లు ఖర్చు చేశాం. హైటెక్‌సిటీ వద్ద ప్రముఖ ఐటీ కంపెనీల మధ్య రూ.వెయ్యి కోట్ల విలువైన మూడున్నర ఎకరాల్లో మహిళా శక్తి స్టాళ్లను ఏర్పాటుచేశాం. తెలంగాణ ఆడబిడ్డలు తయారు చేసే ఉత్పత్తులు అమెజాన్ ద్వారా ప్రపంచం నలుమూలలకు చేరేలా ఒప్పందం కుదుర్చుకున్నాం. ఈగల్ ఫోర్స్ ఏర్పాటుతో డ్రగ్స్ కట్టడిలో కఠినంగా వ్యవహరిస్తున్నాం. మత్తు పదార్థాల వ్యవహారంలో ఎంతటి ప్రముఖులున్నా, పెద్దలైనా ఉపేక్షించబోం. ఇటీవలే కొందరు ప్రజాప్రతినిధులను జైలుకు పంపాం. డ్రగ్స్‌తో పట్టుబడిన ఇద్దరు ప్రముఖుల్ని తీసుకొచ్చి కేసులు నమోదుచేసి చర్లపల్లి, చంచల్‌గూడ జైళ్ల చుట్టూ ఏడాదిపాటు తిప్పితే ఆ భయంతో మిగిలిన వారు దారికొస్తారు. డ్రగ్స్ కట్టడిలో పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించాలి. పాఠశాల స్థాయిలోనే పిల్లలకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించేలా.. డ్రగ్స్ తీసుకోబోమని వారితో డిక్లరేషన్ తీసుకోవాలి. మత కలహాల సమయంలో పనిచేసే పీస్ కమిటీలు ప్రస్తుతం డ్రగ్స్, గంజాయి, మద్యంతో జరిగే నేరాల కట్టడిలో భాగస్వాములు కావాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.




## అక్షరానికి ఆంక్షల సంకెళ్లు.. నిరుద్యోగుల గొంతు కోస్తున్న వ్యవస్థల వైఫల్యం!

* **విద్యా వ్యాపారానికి సర్కారు వత్తాసు - బలిపీఠంపై నిరుద్యోగుల భవిష్యత్తు**
* **వెంక గారి భూమయ్య సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ 9848559863**



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

జ్ఞాన సముపార్జనకు ఎల్లలు ఉండవని, చదువు అనేది ఒక నిరంతర ప్రవాహమని గొప్పలు చెప్పుకునే మన సమాజంలో, నేడు అదే విద్యను సరిహద్దుల పేరుతో, నిబంధనల సాకుతో చెత్తకాగితాలుగా మార్చడం అత్యంత విచారకరం. తెలంగాణ హైకోర్టు ఇటీవల దూరవిద్య డిగ్రీల చెల్లుబాటుపై ఇచ్చిన తీర్పు రాష్ట్రంలోని లక్షలాది మంది అభ్యర్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేసింది. ఇతర రాష్ట్రాలకు చెందిన విశ్వవిద్యాలయాలు తమ ప్రాదేశిక పరిధి దాటి స్టడీ సెంటర్ల ద్వారా అందించే డిగ్రీలు ప్రభుత్వ ఉద్యోగాలకు పనికిరావని తేల్చి చెప్పడం, అక్షరాన్నే నమ్ముకున్న నిరుద్యోగుల ఆశలపై పిడుగు వేయడమే. చట్టం తన పని తాను చేసుకుపోతుందనే సాకుతో, వ్యవస్థలు చేసిన వ్యవస్థీకృత నేరాన్ని అమాయక విద్యార్థుల తలలకు చుట్టడం ఏ రకమైన సామాజిక న్యాయమో పాలకులు సమాధానం చెప్పాలి. అసలు ఈ మొత్తం గందరగోళానికి మూల కారణం ఎవరు? నిబంధనలు ఉల్లంఘించిన విశ్వవిద్యాలయాలా? వాటిని పర్యవేక్షించని ప్రభుత్వాలా? లేక చట్టాల చిక్కుముడి తెలియక చదువుకున్న విద్యార్థులా?

* **విద్యా వ్యాపారానికి సర్కారు వత్తాసు - నిరుద్యోగుల పాలిట శాపం**

ఈ సంక్షోభంలో ప్రధాన దోషి ఎవరైనా ఉన్నారంటే అది నిస్సందేహంగా ప్రభుత్వ యంత్రాంగమే అవుతుంది. ఒక రాష్ట్రానికి చెందిన విశ్వవిద్యాలయం మరో రాష్ట్రంలో స్టడీ సెంటర్లను ఏర్పాటు చేయడం యూజీసీ నిబంధనలకు విరుద్ధమని ఇవాళ కోర్టులు చెబుతున్నాయి. మరి గత రెండు దశాబ్దాలుగా హైదరాబాద్ నగర గల్లీల్లో, జిల్లాల కేంద్రాల్లో ఈ స్టడీ సెంటర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తుంటే విద్యాశాఖ అధికారులు ఏం చేస్తున్నారు? బహిరంగంగా అడ్మిషన్ల ప్రకటనలు ఇస్తూ, వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ, ఏటా వేల మందికి పట్టాలు పంపిణీ చేస్తుంటే ఉన్నత విద్యామండలి కళ్లు మూసుకుందా? అనుమతులు లేని పక్షంలో ఆయా సెంటర్లను ప్రారంభంలోనే ఎందుకు సీజ్ చేయలేదు? విద్యా వ్యాపారం పేరిట వర్సిటీలు దందా సాగిస్తుంటే మౌనంగా ఉండి, ఇవాళ అభ్యర్థులు కష్టపడి చదివి ఉద్యోగాల ముంగిట నిలబడ్డప్పుడు 'మీ సర్టిఫికేట్లు చెల్లవు' అని చెప్పడం ప్రభుత్వాల నైతిక పతనానికి పరాకాష్ఠ. ప్రభుత్వాల మౌనం నిరుద్యోగుల పాలిట శాపంగా మారింది.

* **విశ్వవిద్యాలయాల లాభార్జన - విద్యార్థులపై నేరపూరిత వంచన**

విశ్వవిద్యాలయాల తీరు కూడా ఇక్కడ తీవ్ర విమర్శలకు గురవుతోంది. ఆచార్య నాగార్జున, అన్నామలై, మదురై కామరాజ్ వంటి ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాలు కేవలం ఫీజుల కోసమే అడ్డగోలుగా స్టడీ సెంటర్లను విస్తరించాయి. యూజీసీ నిబంధనల ప్రకారం తమకు ఇతర రాష్ట్రాల్లో డిగ్రీలు ఇచ్చే అధికారం లేదని తెలిసినా, విద్యార్థులను మభ్యపెట్టి అడ్మిషన్లు తీసుకోవడం నేరపూరిత వంచన. జ్ఞానాన్ని పంచాల్సిన సంస్థలే విజ్ఞానాన్ని విక్రయించి, ఆపై బాధ్యత నుంచి తప్పుకోవడం సిగ్గుచేటు. విద్యార్థులు ఆయా వర్సిటీల ప్రతిష్ఠను, ప్రభుత్వ గుర్తింపును నమ్మి చేరారు తప్ప, అడ్డదారిలో పట్టాలు పొందాలని అనుకోలేదు. వర్సిటీలు చేసిన తప్పులకు, వాటిని అడ్డుకోని ప్రభుత్వ వైఫల్యానికి సామాన్య విద్యార్థి తన జీవితాన్ని బలి ఇవ్వాల్సి రావడం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు.

* **ఉద్యోగుల ఉన్నత విద్యపై గొడ్డలిపెట్టు - ఆత్మగౌరవానికి దెబ్బ**

ప్రభుత్వ ఉద్యోగంలో ఉండి, తమ నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి దూరవిద్యను ఆశ్రయించిన వారి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. చదువుకోవాలనే తపనతో కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే, రాత్రింబవళ్లు కష్టపడి డిగ్రీలు పొందిన వారు ఇప్పుడు ఆందోళనలో ఉన్నారు. ఉన్నత చదువు చదివినందుకు ప్రోత్సాహం అందించాల్సింది పోయి, 'నీ డిగ్రీ చెల్లదు' అని వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం ఎంతవరకు సమంజసం? ఇది కేవలం ఉద్యోగాల సమస్య మాత్రమే కాదు, ఒక వ్యక్తి యొక్క విద్యా హక్కును కాలరాయడమే. తెలంగాణకు చెందిన విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లో చదివితే చెల్లవన్నప్పుడు, రేపు ఇదే సూత్రం మన రాష్ట్ర వర్సిటీలకూ వర్తిస్తే మన విద్యార్థుల పరిస్థితి ఏమిటన్నది పాలకులు ఆలోచించాలి. ఇరుగుపొరుగు రాష్ట్రాల మధ్య ఉన్న విద్యా అనుసంధానాన్ని దెబ్బతీయడం వల్ల అంతిమంగా నష్టపోయేది విద్యార్థులే.

* **న్యాయం వర్సెస్ మానవత్వం - బలిపీఠంపై ఒక తరం యువత**

న్యాయస్థానాలు చట్టం యొక్క అక్షర క్రమాన్ని మాత్రమే చూస్తాయి, కానీ ఆ చట్టం వెనుక ఉన్న సామాజిక విధ్వంసాన్ని పరిగణనలోకి తీసుకోకపోవడం దురదృష్టకరం. గతంలో ఇదే తరహా డిగ్రీలతో వేల మందికి ఉద్యోగాలు ఇచ్చి, ఇప్పుడు నోటిఫికేషన్లు వచ్చే సరికి నిబంధనలు మార్చడం సమానత్వపు హక్కును కాలరాయడమే. పాత తప్పులను సరిదిద్దే క్రమంలో కొత్త తరం యువతను బలిపీఠం ఎక్కించడం ప్రభుత్వ చేతకానితనం. ఒక నిరుద్యోగి ఏళ్ల తరబడి కోచింగ్ తీసుకుని, నోటిఫికేషన్ కోసం ఎదురుచూసి, పరీక్ష రాసి అర్హత సాధించిన తర్వాత.. 'నీ డిగ్రీ చట్టవిరుద్ధం' అని చెబితే ఆ అభ్యర్థి మానసిక స్థితి ఏమవుతుందో పాలకులు ఊహించగలరా? ఇన్నేళ్ల కాలంలో విద్యార్థులు వెచ్చించిన సమయం, డబ్బు, శ్రమకు విలువ ఏది? వారి వయస్సు మించిపోయిన తర్వాత ఇప్పుడు మళ్లీ కొత్తగా డిగ్రీలు చేయమంటే అది సాధ్యమయ్యే పనేనా?

* **పరిష్కారం ఎక్కడ? - ప్రభుత్వ తక్షణ కర్తవ్యం**

ఈ సంక్షోభం నుంచి విద్యార్థులను గట్టెక్కించాల్సిన బాధ్యత పూర్తిగా ప్రభుత్వంపైనే ఉంది. కోర్టు తీర్పును గౌరవిస్తూనే, మానవతా దృక్పథంతో ఇప్పటికే డిగ్రీలు పూర్తి చేసిన వారికి లేదా ఆఖరి సంవత్సరంలో ఉన్న వారికి మినహాయింపునిచ్చేలా చర్యలు చేపట్టాలి. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో యూజీసీతో చర్చించి, ఒక ప్రత్యేక గెజిట్ ద్వారా పాత డిగ్రీలకు గుర్తింపునిచ్చేలా ఒత్తిడి తీసుకురావాలి. నిబంధనలు ఉల్లంఘించిన యూనివర్సిటీలపై కఠిన చర్యలు తీసుకోవాలి తప్ప, విద్యార్థుల జీవితాలతో ఆడుకోకూడదు. అక్షరం ఓడిపోతే అది సమాజపు ఓటమి. పాలకులారా, మీ నిర్లక్ష్యంతో ఒక తరం యువతను రోడ్డున పడేయకండి. చట్టాల పేరుతో విద్యావంతులను నిరుద్యోగులుగా మార్చడం ఆపండి.

**చరిత్ర క్షమించని విద్యా ద్రోహం**

ఇప్పటికైనా మేల్కొని విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత మీదే. లేదంటే చరిత్ర మిమ్మల్ని విద్యా ద్రోహులుగా ముద్ర వేస్తుంది. అక్షరానికి ఆంక్షలు విధించే ఏ వ్యవస్థ అయినా ఎక్కువ కాలం నిలబడదు, అది తిరుగుబాటుకు దారితీస్తుంది. విద్యార్థుల ఆవేదనను ఆలకించి, తక్షణమే ఒక సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆశిస్తున్నాం. ప్రభుత్వం తలచుకుంటే అసాధ్యమేమీ లేదు, చట్టం పేరుతో జరుగుతున్న ఈ అన్యాయాన్ని అడ్డుకోవడమే ఇప్పుడు తక్షణ అవసరం. విద్యార్థి లోకం ఈ వివక్షను ఎన్నటికీ క్షమించదు. పాలకులారా, మీ పట్టింపు లేని ధోరణి లక్షలాది కుటుంబాలను రోడ్డున పడేస్తోందని గుర్తించండి. తక్షణమే జోక్యం చేసుకుని అభ్యర్థులకు భరోసా ఇవ్వండి

## ఇంధన మంటల పాపం ఐఓసీఎల్‌దే

అమరావతి: గతేడాది అమ్మకాల కంటే అదనంగా సరఫరా చేస్తున్నామంటూ ప్రభుత్వానికి, అధికారులకు నమ్మకంగా లెక్కలిచ్చిన పెట్రోలియం సంస్థలు తెరచాటున మాత్రం రిటైల్ ఔట్‌లెట్లకు పరిమితులు విధించాయి. ఇండెంట్ పెట్టినా.. వాణిజ్య వినియోగదారులకు డీజిల్ మళ్లిస్తున్నారనే సాకుతో ఇంధనం పంపలేదు. అత్యధిక సరఫరా వాటా కలిగిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) ఏకపక్ష వైఖరి కారణంగా రాష్ట్రంలో సరఫరా వ్యవస్థ ఎక్కడికక్కడ దెబ్బతింది. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని కొరత ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే తలెత్తడానికి ఇండియన్ ఆయిల్ సంస్థ తీరే కారణం. ఈ వ్యవహారంలో ప్రధాన దోషి ఐఓసీఎల్ అయితే.. పెట్రోలియం సంస్థల లెక్కల్ని గుడ్డిగా నమ్మి, సమస్యను పట్టించుకోని పౌరసరఫరాలశాఖ రెండో దోషి. ఒక బంకులో ఇంధనం లేకపోతే పక్కనున్న బంకులపై ఒత్తిడి పెరిగింది. రెండు రోజులపాటు అమ్మాల్సిన డీజిల్ ఒక పూటకే అయిపోయింది. డీజిల్ దొరకడం లేదనే ప్రచారం తీవ్రం కావడంతో వాహనదారులు బంకుల దగ్గర బారులుతీరారు. దీంతో అమ్మకాలు ఒక్కసారిగా పెరిగాయి. నిల్వలు అయిపోయి ఎక్కడికక్కడే బంకులు మూతపడ్డాయి. అయినా పెట్రోలియం సంస్థలు 421 బంకులే మూతపడ్డాయంటూ కళ్లకు గంతలు కట్టే ప్రయత్నం చేశాయి. పౌరసరఫరాలశాఖ కూడా ఆ లెక్కల్నే నమ్ముతూ సమస్య తీవ్రతను అంచనా వేయలేదు.

* **పరిమితులు పెడితే సంక్షోభం వస్తుందని తెలియదా?**

భారీ ప్రాజెక్టులు నిర్వహించే సంస్థలకు సొంతంగా బంకులు ఉంటాయి. పెట్రోలియం సంస్థల నుంచి నేరుగా కొనుక్కుని వినియోగిస్తుంటారు. యుద్ధం తర్వాత వీరికి సరఫరా చేసే డీజిల్ ధర భారీగా (లీటరు రూ.152కి) పెరిగింది. దీంతో ఈ వినియోగదారులు రిటైల్ ఔట్‌లెట్లలో కొంటున్నారని, అందుకే ఔట్‌లెట్లలో డీజిల్ నిల్వలు త్వరగా అయిపోతున్నాయంటూ పెట్రోలియం సంస్థలు సరఫరాకు పరిమితులు విధించాయి. ఇది ఐఓసీఎల్ ఏకపక్ష నిర్ణయమే. ఔట్‌లెట్లకు సరఫరా నిలిపేస్తే ఆ ఒత్తిడి పక్క బంకులపై పడి, సంక్షోభం తలెత్తుతుందని తెలిసినా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంధన సమస్యకు కారణమయ్యారు.

## 'స్కాం'బోడియా.. సైబర్ ముఠాల అడ్డా!

హైదరాబాద్: ఘన చారిత్రక వారసత్వం.. భిన్న సంస్కృతుల వైశిష్ట్యం.. సుందరమైన సముద్ర తీరాలు.. కొలువుదీరిన రాజప్రాసాదాలు.. కంబోడియాకి ఒకప్పటి ఆనవాళ్లు. మరి నేడో.. ఆ దేశం కరడుగట్టిన సైబర్ నేరగాళ్ల అడ్డా! ప్రపంచంలోని ప్రతి మూలనుంచీ బాధితుల్ని ఉచ్చులోకి లాగి విచ్చలవిడిగా రూ.కోట్లు కొల్లగొడుతున్న సైబర్‌క్రైమ్ కేంద్రాల నిలయం!! అలాంటి దోపిడీ సొమ్ముతో ఆ దేశ రాజధాని ఫనామ్‌పెన్‌లో ఆకాశహర్మ్యాలు వెలుస్తున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. సైబర్‌క్రైమ్ కేంద్రాలతో సంబంధముందనే ఆరోపణలతో యూ.ఎస్.ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఆంక్షలు విధించిన స్థిరాస్తిరంగ సంస్థ కె.బి.ఎక్స్. ఇన్వెస్ట్‌మెంట్ లాంటి కంపెనీలే ఈ భవనాల్ని నిర్మిస్తుండటం విచిత్రం.

**విషవిలయం.. మొదలైందిలా**

2019లో కంబోడియాలో ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ నిషేధించడంతో క్యాసినోలు మూతపడ్డాయి. తర్వాత వచ్చిన కొవిడ్ లాక్‌డౌన్‌తో హోటళ్ల వ్యాపారం దెబ్బతింది. దీంతో ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ ముఠాలు సైబర్ నేరాల బాట పట్టాయి. మూతపడిన క్యాసినోలు, హోటళ్లనే సైబర్‌క్రైమ్ కాంపౌండ్‌లుగా మార్చేశాయి. మయన్మార్, లావోస్‌లు సైతం ఈ విషధోరణిని అందిపుచ్చుకున్నాయి. ఉద్యోగాలిస్తామంటూ ఆసియా దేశాల యువతను రప్పించడం.. వారి పాస్‌పోర్టులు లాక్కొని కాంపౌండ్లలో బంధించడం.. చిత్రహింసలకు గురి చేస్తూ వారితోనే బలవంతంగా వాట్సప్ కాల్స్ చేయించడం.. సైబర్ నేరగాళ్ల వ్యాపకంగా మారిపోయింది. అలా కంబోడియాలో మొత్తం 53 సైబర్‌క్రైమ్ కేంద్రాల ద్వారా కార్యకలాపాలు సాగినట్లు 2025లో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ అధ్యయనంలో తేలింది. ఈ ఐదారేళ్లలో ఈ మూడు దేశాల్లోని సైబర్‌క్రైమ్ కేంద్రాల్లో దాదాపు 3.5లక్షల మంది సైబర్ బానిసల్ని బంధించినట్లు యునైటెడ్ స్టేట్స్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ పీస్ సంస్థ నివేదించింది. ఈ కేంద్రాల ద్వారా ఏటా సుమారు 5075 బిలియన్ల అమెరికా డాలర్లను (రూ.7లక్షల కోట్లు) ముఠాలు కొల్లగొట్టినట్లు అంచనా వేసింది. ఒక్క భారత్‌కు చెందిన బాధితులు పోగొట్టుకున్నదే రూ.22,495కోట్లు. ఈ మోసాలపై ప్రపంచవ్యాప్తంగా ఒత్తిడి పెరగడంతో కంబోడియా ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోంది. గత జనవరిలో ఏకంగా 5వేల మందిని అరెస్ట్ చేసింది. 48 వేలకుపైగా సైబర్ బానిసల్ని దేశం నుంచి బహిష్కరించింది. సుమారు 2 లక్షల మంది స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లిపోయారు.

## ప్రపంచ సవాళ్లకు పరిష్కార వేదికలుగా వర్సిటీలు

విశాఖపట్నం; ఏయూ ప్రాంగణం: అంతర్జాతీయంగా ఎదురవుతున్న సవాళ్లను విశ్వవిద్యాలయాలు పరిష్కరించే దిశగా పరిశోధనలు సాగించాలని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిచ్చి పరిశోధన కేంద్రాలుగా ఎదగాలన్నారు. విద్యార్థులు డిగ్రీలు సాధిస్తే సరిపోదని, అవసరమైన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. మేధోసంపత్తి హక్కులపై అవగాహన పెంచుకోవడంతో పాటు ఆవిష్కరణలపై కొత్త ఆలోచనలు చేయాలన్నారు. సోమవారం విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. "వందేళ్ల చరిత్ర కలిగిన ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి. తొలి రోజుల్లో ఉప కులపతులుగా పనిచేసిన కట్టమంచి రామలింగారెడ్డి, సర్వేపల్లి రాధాకృష్ణన్ తమ నాయకత్వ పటిమతో వర్సిటీని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లారు. ఎందరో మహారాజులు అందించిన సాయం అభివృద్ధికి అండగా నిలిచింది. అటువంటి వారిని ఈ సమయంలో గుర్తు చేసుకోవడం సముచితం. ఏయూ ఇప్పటికే ఎన్నో వర్సిటీలతో ఒప్పందాలు చేసుకుంది, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కాకుండా ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల జాబితాలో చేరాలి. నేను ఈ స్థాయికి ఎదగడానికి నేను చదివిన విశ్వవిద్యాలయమే బలమైన పునాది వేసింది" అని తెలిపారు.

## రెండున్నర ఏళ్లలో వ్యవస్థల్ని కుప్పకూల్చారు

హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అస్తవ్యస్తంగా తయారైందని భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ విమర్శించారు. పదేళ్ల భారాస పాలనలో సకలం సమకూర్చిపెడితే.. ఎందుకు చేయలేకపోతోందని ప్రశ్నించారు. భారాస పార్టీ రజతోత్సవం సందర్భంగా.. తెలంగాణభవన్‌లో సోమవారం నిర్వహించిన ముగింపు వేడుకలకు కేసీఆర్ హాజరయ్యారు. ఎర్రవల్లి నుంచి ముందుగా బంజారాహిల్స్‌లోని నందినగర్ నివాసానికి.. అక్కడ్నించి తెలంగాణభవన్‌కు వచ్చిన ఆయనకు పార్టీ ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖరరెడ్డి పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు. ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి కేసీఆర్ పుష్పాంజలి ఘటించారు. అనంతరం భారాస రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. ఇటీవల పార్టీలో చేరిన జగిత్యాల మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని పరిచయం చేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఆయన సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటామని చెప్పారు. సమావేశానికి హాజరైన పార్టీ నేతల నుంచి అభిప్రాయాలు స్వీకరించిన అనంతరం కేసీఆర్ ప్రసంగించారు.

**తాగునీటి కొరత.. విద్యుత్తు కోతలు**

"రాష్ట్రంలో తాగునీరు కొరతతో ప్రజలు అల్లాడుతున్నారు. విద్యుత్తు కోతలతో విలవిల్లాడుతున్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, యువత, ఉద్యోగులు.. ఇలా అన్ని వర్గాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. ప్రజలకు ఏమాత్రం పనికిరాని ప్రభుత్వమిది. రెండున్నరేళ్లలోనే పాలనలో వ్యవస్థలన్నింటిని కుప్పకూల్చారు. కాంగ్రెస్ నేతలు అరాచకాలు, అక్రమాలు, భూకబ్జాలకు పాల్పడుతున్నారు. అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చారు. ఒక్కటీ అమలు చేయకుండా మోసం చేస్తున్నారు. ప్రజలు ఈ ప్రభుత్వంపై విసుగు చెందారు. తప్పకుండా వచ్చే ఎన్నికల్లో భారాసను గెలిపిస్తారు. పార్టీ కార్యకర్తలను సైనికుల్లా తీర్చిదిద్దాలి. ప్రతి విద్యాసంస్థలో విద్యార్థి విభాగం కమిటీలు ఏర్పాటు చేయాలి. పార్టీ అనుబంధ సంఘాలను పటిష్ఠం చేయాలి. తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ సైన్యాన్ని తయారు చేసుకోవాలి. రాష్ట్ర పునర్నిర్మాణ యజ్ఞం పునఃప్రారంభించాలి. నియోజకవర్గాల వారీగా ముఖ్య నేతలతో త్వరలో ఎర్రవల్లిలో సమావేశమవుతా. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనపై నడుం బిగిద్దాం" అని కేసీఆర్ పిలుపునిచ్చారు.

## హర్మూజ్ తెరుస్తాం కానీ..!

దుబాయ్/మాస్కో: అమెరికా ఇరాన్ మలి విడత చర్చలపై అనిశ్చితి నెలకొన్న వేళ.. కొత్త ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. హర్మూజ్ జల సంధిని తెరుస్తామని, నౌకల ప్రయాణాలకు అనుమతులిస్తామని ఇరాన్ ప్రతిపాదించింది. అందుకు రెండు షరతులను విధించింది. ఒకటి.. హర్మూజ్ జల సంధి దగ్గర కొనసాగిస్తున్న నౌకాదళ దిగ్బంధనాన్ని అమెరికా ఎత్తి వేయాలి. రెండోది.. అణు కార్యక్రమానికి సంబంధించిన చర్చలను జల సంధి తెరిచిన తర్వాతే కొనసాగించాలి. ఈ మేరకు ప్రతిపాదనలను మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్ ద్వారా అగ్ర రాజ్యానికి ఇరాన్ పంపినట్లు తెలుస్తోంది. దీనిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. ఇరాన్ ప్రతిపాదనలు గతంతో పోలిస్తే మెరుగ్గా ఉన్నాయని, ఒప్పందం కుదుర్చుకోవడానికి సరిపోవని వ్యాఖ్యానించారు.

**హెజ్‌బొల్లాది దేశద్రోహం: లెబనాన్**

ఇజ్రాయెల్‌లెబనాన్ మధ్య జరుగుతున్న చర్చలను హెజ్‌బొల్లా తీవ్రంగా తప్పుబట్టింది. ఇది ఘోరమైన పాపమని, ఈ చర్చలు దేశాన్ని అస్థిరపరుస్తాయని హెచ్చరించింది. దీనిపై లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్ తీవ్రంగా స్పందించారు. చర్చలు జరపడం దేశ ద్రోహం కాదని.. విదేశీ (ఇరాన్) ప్రయోజనాల కోసం దేశాన్ని యుద్ధంలోకి దింపడం అసలైన ద్రోహమని హెజ్‌బొల్లా పేరు ప్రస్తావించకుండా వ్యాఖ్యానించారు. మరోవైపు లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 14 మంది మరణించారు. 37 మంది గాయపడ్డారు. అమెరికా ప్రయోజనాలను మాత్రమే కాపాడుతున్న పాక్ సరైన మధ్యవర్తి కాదని ఇరాన్ ఎంపీ ఇబ్రహీం రెజాయీ పేర్కొన్నారు. 'మధ్యవర్తిత్వానికి అవసరమైన విశ్వసనీయత పాకిస్థాన్‌కు లేదు.

# పెట్రోల్, డిజిల్ కృత్రిమ కొరత సృష్టించొద్దు




రంగారెడ్డి జిల్లాలో పెట్రోల్ కు డీజిల్ కు ఎలాంటి కొరత లేదని ప్రజలకు నమ్మకం కలిగించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి సేల్స్ ఆఫీసర్లకు సూచించారు. సోమవారం రంగారెడ్డి జిల్లాలో కొన్ని పెట్రోల్ బంకులలో పెట్రోల్, డీజిల్ కొరత ఉన్నటువంటి పరిస్థితి పై జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి జిల్లా ఎనర్జీ ఎనర్జీ మానిటరింగ్ కమిటీ సభ్యులతో ఆయిల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతోపాటు పెట్రోల్ బంక్ డీలర్స్ తో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్లు పెట్రోల్ బంక్ డీలర్లను ఎక్కువ మొత్తంలో కొద్దిమంది వినియోగదారులకు అమ్మకాలు జరపకుండా చూడాలని తెలిపారు. అదేవిధంగా అందరు వినియోగదారులు సాధారణ పద్ధతిలోని రోజువారి కొనుగోలు జరపాలని ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసి ప్రమాదాలకు కారణం కారాదని తెలిపారు. క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు పరిస్థితి కొంత మెరుగుపడాలంటే కంపెనీలు సరఫరా పెంచడంతో పాటు పెట్రోల్ బంకుల్లో ఒక్క వినియోగదారునికి అధిక మొత్తంలో అమ్మకాలు జరపడం చూడాలన్నారు. అదేవిధంగా పెట్రోల్ బంకులు యజమానులు సమీక్షలో భాగంగా మాట్లాడుతూ ఆయిల్ కంపెనీలు కొంత సరఫరాను పెంచితే ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు.

## కూకట్ పల్లి లో బి ఆర్ ఎస్ పతకావిష్కరణ



ప్రజాస్ఫూర్తి, కూకట్ పల్లి : బిఆర్ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కూకట్ పల్లి డివిజన్ ప్రకాష్ నగర్ జెండా ఆవిష్కరణ చేశారు. టిఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి చేగురి ప్రభాకర్ కూకట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బొట్టు విష్ణు ఆధ్వర్యంలో ఈ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ యువజన నాయకులు నైనేని అభిలాష్ రావు, బంతుల చైతన్య, ఉదిగి మహేష్, సిరిగాని పవన్, నూనె రాజు, శ్రీధర్ రెడ్డి, కురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునికి శుభాకాంక్షలు తెలిపిన ఏపి నాయకులు



ప్రజాస్ఫూర్తి, రేణుగుంట : భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్ రావు కు తిరుపతి లో ఏపీ బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ ఆధ్వర్యంలో కలిసి ఆయనకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ప్రసాదం, శేష వస్త్రం తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు కురకాలువ వేణు ముదిరాజ్, రేణిగుంట మండలం ఉపాధ్యక్షుడు రాజా రాయల్ తదితరులు పాల్గొన్నారు.

## వెక్టర్ ఇంజినీర్స్ ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి, కాప్రా : చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఇండస్ట్రియల్ ఏరియాలో నూతనంగా ఏర్పాటు చేసిన వెక్టర్ ఇంజినీర్స్ సంస్థను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంస్థ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. పరిశ్రమల అభివృద్ధితో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో యాజమాన్యం సభ్యులు, డివిజన్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, డీఎస్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం



ప్రజాస్ఫూర్తి, కాప్రా:ఓ యువతి అదృశ్యమైన ఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఫిర్యాదుదారు దేవసోత్ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం, ఆయన కుమార్తె డి. సుధ (25) ఈసీఐఎల్‌లోని శ్రీకర హాస్పిటల్‌లో నర్సుగా పనిచేస్తోంది.ఈ నెల 18వ తేదీన కుటుంబ సభ్యులతో ప్రేమ వ్యవహారంలో వచ్చిన విభేదాల కారణంగా ఇంటి నుంచి వెళ్లిపోయింది. అనంతరం ఈసీఐఎల్ ప్రాంతంలోని ఒక హాస్టల్‌లో ఉన్నట్లు సమాచారం లభించినప్పటికీ, ప్రస్తుతం అక్కడ కూడా లేకపోవడం గుర్తించారు. 26వ తేదీన హాస్పిటల్‌లో విచారణ చేయగా, గత రెండు రోజులుగా ఆమె డ్యూటీకి హాజరు కాలేదని తేలింది. ఈ ఘటనలో ఎన్. సురేష్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ సీతారాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువతి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ ఎల్. భాస్కర్ రెడ్డి తెలిపారు.

## రోడ్డుపై పడిపోయిన ధాన్యాన్ని సేకరించి రైతుకు సహాయం చేసిన ట్రాఫిక్ పోలీసు సిబ్బంది



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా కేంద్రం అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డుపై ఓ రైతు తీసుకెళ్తున్న ధాన్యం బస్తా ప్రమాదవశాత్తూ జారి రోడ్డుపై చెల్లాచెదురైంది. అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది కాన్స్టేబుల్ భాస్కర్, పాపాలల్, హోమ్ గార్డ్ ఆఫీసర్ వెంకన్న పరిస్థితిని గమనించి వెంటనే స్పందించారు.రోడ్డుపై పడిన ధాన్యాన్ని వృథా కాకుండా జాగ్రత్తగా సేకరించి తిరిగి బస్తాలలో నింపి రైతుకు అందజేశారు. అంతేకాకుండా, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా వాహనాలను నియంత్రిస్తూ, రోడ్డును శుభ్రపరచి సజావుగా రాకపోకలు సాగేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రైతు భూక్యా బాలాజీ ట్రాఫిక్ పోలీసుల సేవలను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.ప్రజలు కూడా రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ, సరుకు రవాణా సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వారు కోరారు.

## ప్రతి కాంగ్రెస్ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటాం: పరమేశ్వర్ రెడ్డి



కాప్రా, ప్రజాస్ఫూర్తి : కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. కాప్రా సర్కిల్‌కు చెందిన సీనియర్ నాయకుడు బాబురావును కందిగూడలోని ఆయన నివాసంలో పరమేశ్వర్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం ప్రత్యేక చొరవతోనే ఉప్పల్ నియోజకవర్గానికి అవసరమైన నిధులు సమకూరుతున్నాయని, అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పని చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలపై ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడినా సహించబోమని హెచ్చరించారు.ఉప్పల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు పూర్తి కీర్తి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వానికే చెందుతుందని అన్నారు. కొందరు వ్యక్తులు తమ ఉనికి కోసం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్పాల్ రెడ్డి, స్వర్ణరాజ్ శివమణి, కొత్త అంజి రెడ్డి, రాజేందర్, నాగ శేషు, దండల్ల మురళి, పవన్, అజీజ్, తన్నీరు శ్రీహరి, మల్ల రెడ్డి, నాగరాజు, తోటకూర శ్రీకాంత్, శ్రీకాంత్ గౌడ్, సత్యనారాయణ, పూర్ణ యాదవ్, రాజు, లింగం, టిల్లు యాదవ్, రాజన్, గుణశేఖర్, రోకేష్ యాదవ్, శివ, రమాకాంత్ రెడ్డి, ముర్తుజా, షేక్ చోటు బై, షాబుద్దీన్, ఆరిఫ్ కుమార్ తదితర కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## డీజిల్, పెట్రోల్ కొరత.. కిలోమీటర్ల క్యూలు

* **వాహనదారుల పడిగాపులు.. ట్రాఫిక్ అంతరాయం**






ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో డీజిల్, పెట్రోల్ కొరత తీవ్రరూపం దాల్చింది. ఇంధనం సమృద్ధిగా ఉందని అధికారులు చెబుతున్నప్పటికీ, పెట్రోల్ బంకుల వద్ద కనిపిస్తున్న దృశ్యాలు మాత్రం భిన్నంగా ఉన్నాయి. పలుచోట్ల కిలోమీటర్ల మేర వాహనాలు క్యూలో నిలుస్తుండటంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. తెల్లవారుజాము నుంచే ఆటోలు, లారీలు, ట్రాక్టర్లు, ఇతర భారీ వాహనాలు బంకుల వద్ద వరుసగా నిలుస్తున్నాయి. గంటల తరబడి వేచి చూసినా ఇంధనం అందకపోవడంతో వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల వాగ్వాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. సరఫరా లోపం, పెరిగిన డిమాండ్‌తో సమస్య మరింత తీవ్రమవుతోంది. ఇంధన కొరత ప్రభావం రవాణాపై స్పష్టంగా కనిపిస్తోంది. ప్రధాన రహదారులపై వాహనాలు క్యూలలో నిలవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది.ముఖ్యంగా సింగరేణి కార్మికులు విధులకు వెళ్లడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమయానికి పనికి చేరుకోలేకపోవడం వల్ల ఉత్పత్తి కార్యకలాపాలపై ప్రభావం పడే అవకాశముందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇల్లందు, మణుగూరు, భద్రాచలం, కొత్తగూడెం, టేకులపల్లి ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల వద్ద భారీ వాహనాలు నిలవడంతో రహదారులపై రాకపోకలు స్తంభించాయి. ఇలా కొనసాగితే రవాణా వ్యవస్థపై మరింత ప్రభావం పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

* **వడ దెబ్బతో మృతి చెందిన రైతు కుటుంబాలను ఆదుకోవాలి.**
* **హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తికి వినతి చేసిన బిఆర్ఎస్ నాయకులు**



హుస్నాబాద్ , ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ పట్టణం లో ఆరెపల్లి కు చెందిన రైతు నమిలికొండ ఓదయ్య పండించిన ధాన్యం పంటను అమ్ముకోవడానికి వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్తే మార్కెట్ యార్డ్ లోనే దాదాపు వారం రోజుల పాటు వరి ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో తీవ్రమైన ఎండ ప్రభావంతో రైతు ఓదయ్య కు వడ దెబ్బ తగలడం తో ఆసుపత్రి లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఓదయ్య మృతి చెందడం చాలా బాధాకరం అని అతని మరణం తో కుటుంబం లో పెద్ద దిక్కు లేకుండా పోయినారని కాబట్టి వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని బి ఆర్ ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని కోరుతున్నామని టిఆర్ఎస్ నాయకులు ఆర్డీవో రామ్మూర్తికి కలిసి వినతిపత్రం అందించారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాలలో రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలని వారు అధికారులను విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం లో బి ఆర్ ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సూద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జునరెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎమ్ ఏ అన్వర్ పాషా, సీనియర్ నాయకులు వంగ వెంకట్రాంరెడ్డి, అలుమల్ల ప్రభాకర్ రెడ్డి, యాస శ్రీనివాస్ మేకల వికాస్ యాదవ్ బోడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఎగరేసి పార్టీ సంబరాలు జరుపుకున్న బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 2,3వ వార్డు అధ్యక్షులు అంబాల గోవర్ధన్, మారగాని సురేష్ గౌడ్, 3వ వార్డు కౌన్సిలర్ కొరివి రజిత లింగస్వామి, మాజీ ఎంపీపీ గౌనె శ్రీపతి, మాజీ కౌన్సిలర్ బండి ఇందిరా వెంకన్న, మాజీ గ్రామ అధ్యక్షులు కుక్కముడి వెంకన్న,మాల్సూర్, మండల క్రాంతికుమార్,బందెల వెంకన్న,శేనిగరపు కుమార్,గద్దం శ్రీను గౌడ్,అంబాల సాయి కుమార్, రేసు వీరన్న యమ్మ వీరాస్వామి, రావుల యాకయ్య, బందెల శ్రీను,ప్రసాద్, ప్రశాంత్, ప్రభాకర్, ఆదర్శ, వీరన్న, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు జన్మదిన వేడుకలు



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : మల్కాజిగిరి వాణినగర్‌లో రాష్ట్ర రథసారథి ఎన్. రామచంద్ర రావు జన్మదిన వేడుకలు డివిజన్ అధ్యక్షుడు సూర్నర్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.అనంతరం ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా సామాజిక సేవా భావాన్ని ప్రతిబింబిస్తూ ప్రజలకు సేవలు అందించారు.ఈ కార్యక్రమంలో వాసంశెట్టి శ్రీనివాస్, వెంకట్ కిషోర్, గౌలికర్ ఆనంద్, రాంబాబు, గన్న, బాలసుబ్రమణ్యం, బలరాం, మహేష్, వెంకట్ యాదవ్‌తో పాటు డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## నిరంతరం వెలుగుతున్న వీధి దీపాలు

* **అధికారుల నిర్లక్ష్యంపై కాలనీవాసుల ఆగ్రహం**



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : మా కాలనీలో వీధి విద్యుత్ దీపాలు పగలు, రాత్రి తేడా లేకుండా నిరంతరం వెలుగుతున్నాయి. దీనివల్ల విద్యుత్ వృథా అవుతున్నది మాత్రమే కాకుండా, అదనపు చార్జీలు ఎవరి మీద పడతాయనే ప్రశ్నపై కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యపై సంబంధిత అధికారులకు కాలనీవాసులు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర నిర్లక్ష్యంగా భావిస్తున్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోని ఈ ధోరణిపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి, నిరంతరం వెలుగుతున్న దీపాలను సరిచేసి, విద్యుత్ వృథాను నివారించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే, భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఎల్బీనగర్ కాలనీ కృపా కాంప్లెక్స్ కాలనీవాసులు కోరుతున్నారు.

## హిందూ సమ్మేళనం' అతిథులకు తులసి మొక్కలు అందజేత



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి పచ్చదనాన్ని పెంపొందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న ప్రకృతి హరిత దీక్షకురాలు నైనిక రజువా ప్రత్యేకంగా నిలిచారు. ఆదివారం రాత్రి కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో నిర్వహించిన హిందూ సమ్మేళనంలో పాల్గొన్న ముఖ్య అతిథులకు తులసి మొక్కలను అందజేశారు. ఇస్కాన్ మోటివేషనల్ స్పీకర్ కీర్తి రాజదాసు ప్రభుజీ, భద్రాచలంలోని అరుణాచల ఉపాసకులు అరుణాచల స్వామీజీ, ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్, వనవాసి కళ్యాణ పరిషత్ తెలంగాణ ప్రాంత సహ మహిళా ప్రముఖ పెద్దాడు ఆశాలత హాజరయ్యారు. వీరికి నైనిక రజువా తులసి మొక్కలు ఇచ్చి హిందూత్వ గొప్పదనాన్ని చాటిచెప్పారు. ఈ సందర్భంగా వారితో నైనిక మాట్లాడుతూ మొక్కలు నాటడం, పంపిణీ చేయడం ద్వారా పర్యావరణ సంరక్షణపై అవగాహన కల్పించడం తన లక్ష్యమని తెలిపారు. నైనిక అంకితభావం పట్ల వారు అభినందనలు తెలిపారు.

## ఏఆర్ఎస్సై కుటుంబానికి చెక్కు అందజేసిన ఎస్పీ రోహిత్ రాజు



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం :జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ గుండెపోటుతో ఇటీవల మరణించిన ఏఆర్ ఎస్సై ప్రకాశరావు కుటుంబానికి సోమవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తన కార్యాలయంలో రూ. లక్ష విలువ చేసే చెక్కు ను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో నిరంతరం విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మరణించిన పోలీసుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ప్రభుత్వం తరపున మరణించిన పోలీసు అధికారుల కుటుంబాలకు అందవలసిన అన్ని రకాల ప్రతిఫలాలను త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి, జిల్లా కార్యాలయ ఏవో మంజ్యా నాయక్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజు తునికి గ్రామంలో అపశృతి



మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ , ప్రజాస్ఫూర్తి : మెదక్ జిల్లా కౌడిపల్లి మండల పరిధిలోని తునికి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం జెండా ఆవిష్కరణ చేయడానికి వెళ్ళగా అపశృతి చోటు చేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తులు బిఆర్ఎస్ పార్టీ గద్దెను కూల్చివేయడం జరిగింది. దీంతో తునికి గ్రామంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బిఆర్ఎస్ పార్టీ గద్దెను కూల్చింది ఎవరని ఆరా తీయగా కాంగ్రెస్ కార్యకర్త లైన తలారి భూపాల్, ఆరెగూడెం శ్రీశైలం మరో ఇద్దరు కాంగ్రెస్ కార్యకర్తలు బి.ఆర్.ఎస్ పార్టీ గద్దర్ కూల్చినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో బిఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వివాదం తో పాటు తోపులాట జరిగింది.విషయం తెలిసిన వెంటనే నర్సాపూర్ సిఐ జాన్ రెడ్డి, నర్సాపూర్ ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి లు పోలీస్ బలగాలతో ఘటన స్థలానికి చేరుకొని ఇరు పార్టీల కార్యకర్తలను చల్లా చెదురు చేసి ఉద్రిక్తతావాని శాంతింప చేశారు. కాగా తునికి గ్రామంలోని చర్చి వద్ద గత 15 ఏళ్ల క్రితం బి ఆర్ఎస్ పార్టీ గద్దెను నిర్మించి ప్రతి ఏటా పార్టీ ఆవిర్భావ దినోత్సవ రోజు పార్టీ జెండా ఆవిష్కరణ చేసేవారు. గద్దె స్థలం ఆరెగూడెం శ్రీశైలం, తలారి భూపాలకు చెందిన స్థలం కాబట్టి బి ఆర్ఎస్ పార్టీ గద్దెను కూల్చివేసామని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుగా కొనసాగుతున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న నర్సాపూర్ సిఐ జాన్ రెడ్డి, ఎస్ఐ రంజిత్ కుమార్ రెడ్డిలు స్థలాన్ని పరిశీలించిన దర్యాప్తు చేస్తున్నారు.

# పీర్జాదిగుడ లో ఘనంగా బిఆర్ ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




మెడిపల్లి, ప్రజాస్ఫూర్తి : బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి ఏదవల్లి రఘువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో పీర్జాదిగూడ, మేడిపల్లి డివిజన్ల నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులతో కలిసి పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా తెలంగాణ తల్లి,అమరవీరుల స్థూపాల చిత్రపటాలకు పుష్పాంజలి గటించి నివాళులు అర్పించిన అనంతరం జెండా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన అపారమైన త్యాగాలు, పోరాట స్ఫూర్తి, బీఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన పథకాలు, అభివృద్ధి దిశగా పార్టీ తీసుకున్న నిర్ణయాలను విశదీకరించారు., కార్యకర్తలే పార్టీకి బలమని, ప్రతి కార్యకర్త ప్రజల మధ్య ఉండి పార్టీ ఆలోచనలను, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, కౌడే పోచయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షులు ప్రభు, మైనారిటీ అధ్యక్షులు జిలాని పాషా, సీనియర్ నాయకులు జావీద్ ఖాన్, ఆకుల మధుకర్, కందుకూరి ఆంజనేయులు, బాలరాజు, కోనేటి వెంకట్, యాసారం శ్రీనివాస్, మునికుంట్ల కిరణ్ గౌడ్, పింగళి జోగిరెడ్డి, గడీల జగన్ రెడ్డి, శ్యామల శ్రీనివాస్, ప్రవీణ్ రెడ్డి, బుల్లెట్ శంకర్, కిరణ్ నాయక్, స్మార్ట్ సతీష్, వెంకట్, శంకర్ గౌడ్, చిర్ర సంతోష్,సోమేష్, రామకృష్ణ, నర్సిరెడ్డి, మేడబోయిన విజయ్ కుమార్, తిరుపతి రెడ్డి, అక్కల శ్రీనివాస్, మల్లం వెంకటేష్ గౌడ్, శ్రీకాంత్, సత్యం, శ్యామల నర్సింహా, శంకరయ్య, ఉపేందర్, పాశం నరేందర్ రెడ్డి, కళ్యాణి, సావిత్రి, సరస్వతి, ఇందిర, వాణి, వెంకన్న, పన్నబాయ్, తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్బీఐ బ్యాంకులో దొంగతనం



మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ, ప్రజాస్ఫూర్తి : మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని గూడెం గడ్డ గ్రామానికి చెందిన పర్వతాలు అనే వ్యక్తి ఈరోజు అవసరం నిమిత్తం నర్సాపూర్ యూనియన్ బ్యాంకు నుండి 50000 వేల రూపాయలు విత్ డ్రా చేసుకొని బ్యాంకు నుండి బయటకు వచ్చి తన స్నేహితుడు అయినా రవి ఫోన్ చేయడంతో ఎస్బిఐ బ్యాంక్ కి వెళ్ళాడు తన స్నేహితుని కోసం బ్యాంకులో ఫామ్ నింపి క్యూ లైన్ లో ఉండగా అదే సమయంలో నరసాపూర్ కి చెందిన రామారావు పుష్పలేటి శ్రీహరి అనే వ్యక్తులు తన వెనకాల నిలబడి కావాలని ముందుకు నెట్టేశారు. అట్టి సమయంలో తమ జేబులో ఉన్న డబ్బులు చెక్ చేసుకోగా బ్యాంకు లో నుండి విత్ డ్రా చేసిన అమౌంట్ కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికినట్టు పేర్కొన్నాడు ఆ తరువాత నర్సాపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి తమ డబ్బులు తనకు ఇప్పించాలని పోలీసులను ఆశ్రయించాడు. ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి కేసు నమోదు చేసుకొని సిసి ఫుటేజ్ పరిశీలిస్తున్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎస్ఐ రంజిత్ రెడ్డి పేర్కొన్నాడు.

# ఘనంగా బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు జన్మదిన వేడుకలు



జగద్గిరిగుట్ట,ప్రజాస్ఫూర్తి :బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు జన్మదిన వేడుకల సందర్భంగా సోమవారం బిజెపి కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట చివరి బస్ స్టాప్ లో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం కార్మికులకు పనులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ సెల్ కో కన్వీనర్ రావుల శేషగిరి , రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి పరకాల సుధా , జిల్లా ఉపాధ్యక్షులు గరిగ శేఖర్ , జిల్లా స్పోకెపర్సన్ సురేష్ రెడ్డి , సిద్ది రామి రెడ్డి, రాజు యాదవ్, మహేందర్, పరుశురాం, సాయి ప్రతాప్ రాజేందర్ రెడ్డి కుమార్ యాదవ్స్, గోపాల్ నరసింహ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించి పరిష్కరించాలి

- **ఉద్యోగులందరూ స్వీయ జనగణన కార్యక్రమంలో తమ వివరాలు నమోదు చేసుకోవాలి,**
- **జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశం మందిరంలో సంబంధిత అన్ని విభాగాల అధికారులతో కలిసి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సంబంధిత విభాగానికి సిఫారసు చేయాలని, ప్రతి దరఖాస్తులు పారదర్శకంగా పరిశీలించాలని సూచించారు, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు నిర్వహించిన అన్ని కార్యక్రమాలను అందరూ సమిష్టిగా విజయవంతం చేయడం జరిగిందని, రానున్న రోజుల్లో మరింత పకడ్బందీగా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు, ప్రజావాణి దరఖాస్తులను కూడా పరిష్కరించాలని కోరారు.ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు జరిగే స్వీయ జన గణన కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు తమ పరిధిలో ఉన్న ప్రతి ఉద్యోగులు వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు,ప్రజావాణిలో వివిధ శాఖలలో మొత్తం (179) దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. మరిపెడ మండల కేంద్రంలోని సర్వే నంబర్ 264లో గల 02 ఎకరాల 16 గుంటల ప్రభుత్వ భూమిని, నిరుపేదలైన సుమారు 30 మంది పాత్రికేయులకు నివాస గృహాల కోసం కేటాయించాలని మరిపెడ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. పెండింగ్‌లో ఉన్న భూ మార్పిడి, వారసత్వ హక్కులు మరియు ఇతర ధరణి సంబంధిత సమస్యలను పరిష్కరించాలని పలువురు రైతులు దరఖాస్తు చేసుకున్నారు.కొత్త రేషన్ కార్డుల మంజూరు , ఆసరా పింఛన్ల కోసం అర్హులైన లబ్ధిదారుల నుండి వినతులు అందాయి.డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం మరియు తాగునీటి సమస్యలపై ప్రజలు కలెక్టర్‌కు విన్నవించారు.ప్రజావాణి కార్యక్రమం సమయం పూర్తి అయిన అదనంగా రెండున్నర గంటల వరకు దరఖాస్తులతో వేచి ఉన్న ప్రజల యొక్క వినుతులను స్వీకరించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు, మండల కేంద్రాలలోని గూగుల్ మీట్ ద్వారా సంబంధిత అధికారులకు సమస్యలను వివరించి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు,ఈ ప్రజావాణి కార్యక్రమంలో మహబూబాబాద్ రెవిన్యూ డివిజనల్ అధికారినీ కృష్ణవేణి, జిల్లా పరిషత్ సీఈవో పురుషోత్తం, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మధుసూదన రాజు, అన్ని విభాగాల జిల్లా అధికారులు,పర్యవేక్షకులు మదన్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులు రిమాండ్



ప్రజాస్ఫూర్తి, కాప్రా : హత్యాయత్నం కేసులో కుషాయిగూడ పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, భువనగిరి నివాసి పాషం శ్రీనివాస్ (53), వ్యాపారవేత్త,పై గతంలో కలిసి పనిచేసిన ఖాజా అనే వ్యక్తితో ఆర్థిక లావాదేవీల విషయంలో విభేదాలు ఏర్పడ్డాయి. ఈ విభేదాలను మనసులో పెట్టుకున్న ఖాజా, శ్రీనివాస్‌ను హతమార్చేందుకు పథకం రచించాడు. ఈ క్రమంలో,ఈ నెల 24న మధ్యాహ్నం సుమారు 4 గంటల సమయంలో రాధికా ఎక్స్ రోడ్‌లోని స్వాగత్ గ్రాండ్ హోటల్ వద్ద భోజనం చేస్తున్న శ్రీనివాస్‌పై ఖాజా, తన డ్రైవర్ అజ్మద్‌తో కలిసి దాడికి ప్రయత్నించారు. అయితే దాడి విఫలమవడంతో, వారు వెంట తెచ్చుకున్న కత్తులను అక్కడే వదిలి పారిపోయారు. సంఘటన స్థలం నుండి పోలీసులు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి దర్యాప్తులో భాగంగా, ఈ నెల 26న కుషాయిగూడ ఎస్ఐ ఎన్. వెంకన్న ఆధ్వర్యంలో భువనగిరిలో నిందితులు ఖాజా, అజ్మద్‌లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రెండు సెల్ ఫోన్లు, ఒక కారు స్వాధీనం చేసుకుని, మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు మరింత దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# నూతన పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలి

- **తహసిల్దార్ కార్యాలయమును ముట్టడించిన సిపిఎం**




వలిగొండ, ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం యాభై ఏడూ సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి, వితంతువులకు వికలాంగులకు నూతన పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని, ఇందిరమ్మ రెండో విడత ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకతను పాటిస్తూ రాజకీయాలకు తావు లేకుండా గ్రామ సభల ద్వారానే గుర్తించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం వలిగొండ తహసిల్దార్ కార్యాలయం ముట్టడిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల మేనిఫెస్టోలో యాభై ఏడూ సంవత్సరాలు నిండిన వృద్ధులకు, వితంతువులకు నాలుగు వేల రూపాయలు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు ఆరు వేల రూపాయలు ఇస్తామని, కుటుంబంలో భార్యాభర్తలకు తేడా లేకుండా ఇస్తామని ప్రకటించి వారు అధికారంలోకి వచ్చి ఇరవై తొమ్మిది నెలలు గడుస్తున్న నేటికీ హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు, అదేవిధంగా ఇంటి స్థలం లేని పేదలందరికీ ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని మరోవైపు ఇంటి స్థలం ఉన్నవారికి నూతన ఇండ్లను ఇస్తామని ప్రకటించి ప్రతిష్టాత్మకంగా చేపట్టామని చెప్పుకునే ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించడం లేదన్నారు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గ్రామసభల ద్వారా గుర్తించకుండా తమ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో నింపిన ఇందిరమ్మ కమిటీల ద్వారా కాంగ్రెస్ కార్యకర్తల పథకంగా మారుస్తున్నారని విమర్శించారు, గత పాలకులు చేసిన పొరపాట్లను చేయకుండా పారదర్శకంగా చేస్తామని ఇచ్చిన హామీని విస్మరించాలని గుర్తు చేశారు. ఇప్పటికైనా రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో రాజకీయాలకు తావు లేకుండా ఇల్లు లేని పేదలందరినీ గుర్తించి గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక డిప్యూటీ తహసిల్దార్, ఎంపీడీవోలకు దరఖాస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు,సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు కందడి సత్తిరెడ్డి, మండల కమిటీ సభ్యులు గాజుల ఆంజనేయులు, కల్కూరి రామచందర్, చీర్క శ్రీశైలం రెడ్డి, దుబ్బ లింగం,కవిడే సురేష్, కల్కూరి ముత్యాలు,కర్ణ కంటి యాదయ్య, బూడిద మనమ్మ, వలిగొండ పట్టణ నాయకులు శీలం ఇందిర,కొండూరు సత్తయ్య,వివిధ గ్రామాల నాయకులు దొడ్డి బిక్షపతి,సిర్పంగి శ్రీరాములు,పలుసం స్వామి,మారబోయిన నరసింహ,సల్ల ఐలయ్య,దయ్యాల మల్లేశం,రాధారపు మల్లేశం, పలసం లింగం,కందకట్ల సాయిరెడ్డి,గుండెపురి నరసింహ,కొమ్ము స్వామి , చేగూరి నగేష్, నారి రామస్వామి,ఉండ్రాటి పాపయ్య,ఏటెల్లి నరసింహ,రేపాక ముత్యాలు,రాపోతు వెంకులు,భూపతి రాములు,బంధారపు ధనంజయ,రుద్రపల్లి రామలింగం,జక్కి రాఘవరెడ్డి,గంగాపురం వెంకటేశం, మారబోయిన ముత్యాలు,పెద్ద బోయిన భీమరాజు ,వడ్డెమాని రవి,కాటేపల్లి వెంకటేశం,మైసొల్ల నరేందర్,వీరమల్ల శ్రీకాంత్, పాలోజు శంకరాచారి,రుద్రపల్లి లింగయ్య,మంద సంజీవ,గోలన్ కొండ బాలనరసింహ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ జనగణనకు ఖమ్మం జిల్లా సిద్ధం..!

- **-జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**

ప్రజాస్ఫూర్తి, ఖమ్మం : జిల్లాలో జన గణనను డిజిటల్ విధానంలో సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరెట్ లో జనగణన పై కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ మాట్లాడుతూ 2017 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన తాను భూపాలపల్లి, జగిత్యాల,ములుగు జిల్లాల్లో పనిచేసి ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో విధులు నిర్వహిస్తున్నానని తెలిపారు.జిల్లాలో ప్రతి ప్రభుత్వ పథకం అర్హులైన వారికి పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జనగణన ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, ముఖ్యంగా స్వీయ నమోదు ద్వారా ఖచ్చితమైన వివరాలు నమోదు చేయాలని ప్రజలను కోరారు.జన గణన రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశ హౌస్ లిస్టింగ్ లో స్వీయ గణన ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 2651 హౌస్ లిస్టింగ్ బ్లాకులు గుర్తించామని, ప్రతి బ్లాక్‌లో సుమారు 300 ఇళ్లు, 800 జనాభా ఉంటుందని వివరించారు.ఈ ప్రక్రియ కోసం 2669 మంది ఎన్యుమరేటర్లు, 485 మంది సూపర్వైజర్లను (రిజర్వ్‌తో సహా) నియమించామని తెలిపారు. స్వీయ నమోదు కోసం se.census.gov.in పోర్టల్‌లో కుటుంబంలోని ఒక సభ్యుడు లాగిన్ అయి వివరాలు నమోదు చేయవచ్చని తెలిపారు.నమోదు చేసే సమయంలో అత్యంత జాగ్రత్తగా వివరాలు నమోదు చేయాలని, ఒకసారి నమోదు చేసిన తరువాత సవరణకు అవకాశం ఉండదని సూచించారు. నమోదు చేసిన మొబైల్ నంబర్‌కు 11 అంకెల సంఖ్య వస్తుందని, ఆ సంఖ్యను ఎన్యుమరేటర్‌కు అందజేయాలని తెలిపారు.ఏవైనా తప్పులు ఉంటే ఎన్యుమరేటర్ ద్వారా మాత్రమే సవరించుకోవచ్చని స్పష్టం చేశారు. డిజిటల్ విధానంలో జరుగుతున్న ఈ జనగణనలో డేటా గోప్యతకు పూర్తి భద్రత ఉంటుందని, స్వీయ నమోదు ద్వారా వేగవంతంగా, ఖచ్చితమైన డేటా సేకరణ సాధ్యమవుతుందని చెప్పారు.జన గణన 2027 కోసం జిల్లాలో అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని, స్వీయ నమోదు చివరి తేదీ మే 10 అని తెలిపారు. సాధారణంగా నివసించే ప్రదేశంలోనే ప్రజలు నమోదు కావాలని సూచించారు. సోమవారం ఉదయం ఉప ముఖ్యమంత్రి స్వీయ నమోదు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం, ప్రజల మధ్య మీడియా వారధిగా కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.వేసవి చర్యల ప్రణాళిక అమలు గురించి మాట్లాడుతూ, జిల్లాలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజల కోసం ప్రధాన ప్రాంతాల్లో తాగునీరు,ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని, వేడి ప్రభావం తగ్గించేందుకు అవసరమైన సూచనలు ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు.ఆరోగ్యం, విద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని,సంక్షేమ హాస్టళ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఫీల్డ్ స్థాయి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా మని పేర్కొన్నారు.జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరా లో ఎలాంటి ఇబ్బందులు లేవని, ఈ రోజు 110 లోడ్లు జిల్లాకు చేరాయని తెలిపారు. సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, లాజిస్టిక్ సమస్యలు రాకుండా అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు.ఈ మీడియా సమావేశంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, సీపీఓ,సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు..

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలి

- **స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**



భువనగిరి ప్రజాస్ఫూర్తి : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి , వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 57అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 39,జిల్లా పంచాయతీ 5, చేనేత , జౌళి 4, మున్సిపాలిటీ 2 , శిశు సంక్షేమ 2, జిల్లా వ్యవసాయ 2, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, హౌసింగ్, సర్వే ల్యాండ్ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సి.ఈ.ఓ శోభారాణి , జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆర్ ఎస్ తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం


- **జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్**




జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం కనుమరుగు చేసిందని జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా సోమవారం జగద్గిరిగుట్ట డివిజన్ లో వాడవాడలా నిర్వహించిన ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లోమాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ పాల్గొని బి ఆర్ ఎస్ జెండాను అవిష్కరించారు.ఆవిష్కరణలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి ఆర్ ఎస్ తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు..నాటి తెలంగాణ రాష్ట్ర సమితి నేడు భారత రాష్ట్ర సమితిగా రూపాంతరం చెంది 26 సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా *జగన్ మాట్లాడుతూ ఉద్యమ పార్టీగా మొదలైన బి.ఆర్.ఎస్ ప్రస్థానం టిఆర్ఎస్ పార్టీగా ఆవిర్భవించి నేడు టిఆర్ఎస్ గా రూపాంతరం చెంది రాష్ట్ర సాధన తో పాటు తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో కీలకపాత్ర వహించిందని అన్నారు. 10 సంవత్సరాల టిఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. రానున్న ఎన్నికలలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. *ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్. నాయకులు. కొలుకుల జైహింద్. వేణు యాదవ్. మల్లారెడ్డి.. ఆజాం. హనుమంతు. యాదగిరి. దాసు. విట్టల్ ముదిరాజ్. సాజిద్. నాని. బ్రహ్మచారి. మనోజ్. ప్రభాకర్. ఇంద్ర గౌడ్ జ్యోతి. రాయి విగ్నేష్. మెట్ల శీను. నరసయ్య. ముంతాజ్ పాపిరెడ్డి. గోపాల్. బసవేశ్వర మహేందర్ ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సభలో మా ఎంపీలే ఉంటే.. రణరంగం సృష్టించేవాళ్లు

: **కేసీఆర్**



హైదరాబాద్: రాష్ట్రంలో రైతుల పరిస్థితి దిగజారిపోయిందని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. ప్రభుత్వానికి ధాన్యం కొనడం చేత కావట్లేదని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడారు. ‘‘రాష్ట్రంలో ఏం జరుగుతోందో అర్థం కావడం లేదు. తెలంగాణ గురించి ఎంపీ తేజస్వి సూర్య ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్, భాజపా ఎంపీలు ఒక్కమాట మాట్లాడలేదు. బీఆర్ఎస్ ఎంపీలు లోక్‌సభలో ఉండి ఉంటే రణరంగం సృష్టించేవాళ్లు. కాళేశ్వరంపై రాజ్యసభలో సీఆర్ పాటిల్ మాట్లాడితే సురేశ్‌రెడ్డి గట్టిగా ఖండించారు. తెలంగాణ గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్, భాజపా నేతలు ఏం చేస్తున్నారు?’’ అని ప్రశ్నించారు. ‘‘రాష్ట్ర విభజన సమయంలో.. హైదరాబాద్ విషయంలో రాజీ పడాలని సోనియా గాంధీ ఎన్నోసార్లు చెప్పారు. కానీ.. నేను ఎప్పుడూ రాజీ పడలేదు.. అది నా చిత్తశుద్ధి’’ అని కేసీఆర్ అన్నారు.

# కవిత స్థాపించిన 'టీఆర్ఎస్'పై స్పందించిన కేటీఆర్

- చాలా పార్టీలు వస్తుంటాయి, పోతుంటాయన్న కేటీఆర్
- దేశంలో పాతికేళ్లు పూర్తి చేసుకున్న పార్టీలు తక్కువగా ఉన్నాయని వ్యాఖ్య
- తేజస్వీ సూర్య మాట్లాడితే మొదట ఖండించింది తామేనన్న కేటీఆర్

తన సోదరి కవిత ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పార్టీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. చాలా పార్టీలు వస్తుంటాయి, పోతుంటాయని వ్యాఖ్యానించారు. భారతదేశంలో పాతికేళ్లు పూర్తి చేసుకున్న పార్టీలు చాలా తక్కువగా ఉన్నాయని చెప్పారు. కొత్త పార్టీని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ గురించి చాలామంది ఏదేదో మాట్లాడుతున్నారని, వాటిని కూడా పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు.

* తేజస్వీ సూర్య మాట్లాడితే మొదట ఖండించింది మేమే

బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య పార్లమెంటులో తెలంగాణ విభజన గురించి తప్పుగా మాట్లాడితే ముందుగా ఖండించింది తమ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, దామోదర్ రావులేనని కేటీఆర్ గుర్తు చేశారు. తేజస్వీ సూర్య తనకు కూడా ఫోన్ చేసి, తాను మాట్లాడిన దానిని మీ (బీఆర్ఎస్) వాళ్లు తప్పుగా అర్థం చేసుకున్నారని చెప్పారని, కానీ మీరు మాట్లాడింది తప్పని ఆయనకు చెప్పేశానని కేటీఆర్ తెలిపారు. మేం ఖండించిన తర్వాతనే ఆయన సభలో వివరణ ఇచ్చారని చెప్పారు. బీఆర్ఎస్ సభ్యులు లోక్ సభలో ఉండి ఉంటే మా వాళ్లు అప్పుడే ఖండించేవారని చెప్పారు.



## లోక్‌సభలో మా ఎంపీలే ఉంటే.. రణరంగం సృష్టించేవాళ్లు : కేసీఆర్

హైదరాబాద్: రాష్ట్రంలో రైతుల పరిస్థితి దిగజారిపోయిందని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. ప్రభుత్వానికి ధాన్యం కొనడం చేత కావట్లేదని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడారు. ''రాష్ట్రంలో ఏం జరుగుతోందో అర్థం కావడం లేదు. తెలంగాణ గురించి ఎంపీ తేజస్వి సూర్య ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్, భాజపా ఎంపీలు ఒక్కమాట మాట్లాడలేదు. బీఆర్ఎస్ ఎంపీలు లోక్‌సభలో ఉండి ఉంటే రణరంగం సృష్టించేవాళ్లు. కాళేశ్వరంపై రాజ్యసభలో సీఆర్ పాటిల్ మాట్లాడితే సురేశ్‌రెడ్డి గట్టిగా ఖండించారు. తెలంగాణ గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్, భాజపా నేతలు ఏం చేస్తున్నారు?''



అని ప్రశ్నించారు. ''రాష్ట్ర విభజన సమయంలో.. హైదరాబాద్ విషయంలో రాజీ పడాలని సోనియా గాంధీ ఎన్నో సార్లు చెప్పారు. కానీ.. నేను ఎప్పుడూ రాజీ పడలేదు.. అది నా చిత్తశుద్ధి'' అని కేసీఆర్ అన్నారు.

## అంబర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం.. మహీంద్రా సర్వీస్ సెంటర్‌లో చెలరేగిన మంటలు!

- అంబర్‌పేటలోని 6 నంబర్ చౌరస్తా వద్ద ఉన్న మహీంద్రా సర్వీస్ సెంటర్‌లో అగ్నిప్రమాదం
- మంటలను అదుపు చేసేందుకు శ్రమిస్తున్న అగ్నిమాపక సిబ్బంది
- పలు వాహనాలు, విడిభాగాలు అగ్నికి ఆహుతైనట్లు సమాచారం

హైదరాబాద్ అంబర్‌పేటలోని 6 నంబర్ చౌరస్తా వద్ద ఉన్న మహీంద్రా సర్వీస్ సెంటర్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. భారీగా మంటలు ఎగిసిపడటంతో ఆ ప్రాంతమంతా నల్లటి దట్టమైన పొగ కమ్మేసింది. ప్రమాద



సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో మరిన్ని ఫైర్ ఇంజిన్లను రంగంలోకి దింపి మంటలను అదుపు చేసేందుకు శ్రమిస్తున్నారు. సర్వీస్ సెంటర్ పక్కనే నివాస సముదాయాలు ఉండటంతో, మంటలు వ్యాపిస్తాయేమోనన్న భయంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ముందుజాగ్రత్త చర్యగా సమీప ఇళ్లలోని వారిని అధికారులు అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ ప్రమాదంలో సర్వీస్ సెంటర్‌లోని పలు వాహనాలు, విడిభాగాలు అగ్నికి ఆహుతైనట్లు తెలుస్తోంది. ప్రమాదానికి గల కారణాలు (షార్ట్ సర్క్యూట్ లేదా ఇతరత్రా) ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## తెలంగాణ పోలీసులకు గుడ్‌న్యూస్ చెప్పిన డీజీపీ

హైదరాబాద్: తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి పోలీసులకు శుభవార్త చెప్పారు. పోలీసుల పుట్టినరోజు, పెళ్లి రోజున ప్రత్యేక సెలవు మంజూరు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసులు ఒత్తిడిలో పనిచేస్తూ వ్యక్తిగత జీవితానికి సమయం ఇవ్వలేకపోతున్నారని డీజీపీ తెలిపారు. వారికి మానసిక ఉల్లాసంతో పాటు కుటుంబ బంధాలు బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అత్యవసర పరిస్థితులు మినహా సిబ్బందికి సెలవులు మంజూరు చేయాలని ఆదేశించారు. ఆధారాలు, దరఖాస్తు ఆధారంగా సెలవులు మంజూరు చేయనున్నట్లు స్పష్టం చేశారు.



మరోవైపు రాష్ట్రంలో 22 మంది డీఎస్పీలు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీజీపీ శివధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

## కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలి: మహేశ్ కుమార్ గౌడ్

- బీజేపీ తెలంగాణలో సెక్యులర్ ఓట్లను తొలగించేందుకు కుట్ర చేస్తుందని విమర్శ
- రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం అనే రెండు చక్రాలపై ప్రజాపాలన సాగుతోందన్న టీపీసీసీ చీఫ్
- వచ్చేసారి 2023 ఎన్నికల ఫలితాలు రిపీట్ కావాలని ఆకాంక్ష

రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడమే ప్రతి కార్యకర్త ధ్యేయం కావాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. బీజేపీ తన కుటిల యత్నాల్లో భాగంగా తెలంగాణలో సెక్యులర్ ఓట్లను తొలగించేందుకు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, అడ్డదారుల్లో ఓట్లను తొలగించే కుట్రను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

బూత్ లెవల్ ఏజెంట్ నియామకం, పనితీరు విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకూడదని అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్ఠత కోసం బూత్ లెవల్ ఏజెంట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం అనే రెండు చక్రాలపై ప్రజాపాలన సాగుతోందని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లేని సంక్షేమ పథకాలు మన వద్ద అమలవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, ఇది సాధారణ విషయం కాదని పేర్కొన్నారు. ఇది ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. వచ్చేసారి 2023 ఎన్నికల ఫలితాలు మళ్లీ రిపీట్ కావాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో అత్యధిక పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలు గెలవడమే



తమ లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. త్వరలో కార్పొరేషన్ పదవుల భర్తీ ఉంటుందని హామీ ఇచ్చారు. నాయకులు తమ సమయంలో 80 శాతాన్ని పార్టీ కోసం కేటాయించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్ఠంగా ఉంటేనే భవిష్యత్తు విజయాలు సాధ్యమవుతాయని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.

## కరీంనగర్ శ్రీచైతన్య కాలేజీలో దొంగతనం.. నిందితుడు అరెస్ట్

- కరీంనగర్ లోని శ్రీచైతన్య కాలేజీలో నిన్న తెల్లవారుజామున దొంగతనం
- రూ. 5 లక్షల నగదు, బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన బొద్దుల యుగేందర్
- దొంగిలించిన డబ్బు, గొలుసును స్వాధీనం చేసుకున్న పోలీసులు

కరీంనగర్ లోని మంకమ్మతోట ప్రాంతంలో ఉన్న శ్రీచైతన్య కాలేజీలో దొంగతనం జరిగింది. ఈ చోరీని పోలీసులు ఛేదించారు. జల్సాల కోసం దొంగతనాలకు అలవాటు



పడి, విద్యా సంస్థలనే లక్ష్యంగా చేసుకుంటున్న పాత నేరస్తుడు బొద్దుల యుగేందర్‌ను కరీంనగర్ టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. కరీంనగర్ సీపీ గౌస్ ఆలం ఈ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. ఏప్రిల్ 26వ తేదీ తెల్లవారుజామున మంకమ్మతోటలోని శ్రీ చైతన్య కాలేజీ ఆఫీసు తాళాలు పగులగొట్టిన నిందితుడు, బీరువాలో ఉన్న రూ. 5 లక్షల నగదు, ఒక బంగారు గొలుసును ఎత్తుకెళ్లాడు. దొంగిలించిన సొత్తును ఎవరికీ అనుమానం రాకుండా తన ఇంటి వెనుక ఉన్న కట్టెల కుప్పలో దాచిపెట్టాడు. పోలీసులు పక్కా సమాచారంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని, దొంగిలించిన రూ. 5 లక్షల నగదును, 10 గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు.

## ఇంధన కొరత ఏర్పడినందుకు చంద్రబాబు సిగ్గుపడాలి: షర్మిల

* సమీక్షలు, సలహాలతో ఇంధన కొరత తీరదన్న షర్మిల
* రాష్ట్రంలో 70 శాతం బంకులు మూతపడ్డాయని వ్యాఖ్య
* కూటమి ప్రభుత్వ పాలనా వైఫల్యమని ఆరోపణ

రాష్ట్రంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్రంగా స్పందించారు. కేవలం సమీక్షలు, సలహాలతో ఇంధన కొరత తీరదని, 24 గంటల డెడ్ లైన్‌తో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 70 శాతం బంకులు



మూతపడటం అత్యంత దారుణమని, దీనిని అత్యవసర పరిస్థితిగా గుర్తించి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. "దేశంలో ఎక్కడా లేని ఇంధన కొరత ఏపీలోనే ఏర్పడినందుకు చంద్రబాబు సిగ్గుపడాలి. ప్రజలను ఎర్రటి ఎండలో కిలోమీటర్ల మేర నిలబెట్టడం కూటమి పాలనా వైఫల్యానికి నిదర్శనం" అని షర్మిల మండిపడ్డారు. మోదీకి మద్దతు ఇచ్చి ప్రధాని పీఠంపై కూర్చోబెట్టినా రాష్ట్రానికి ఇంధన కష్టాలు రావడం బాధాకరమన్నారు. ఇంధన కొరత వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే ప్రమాదం ఉందని, ప్రభుత్వం వెంటనే నిద్రమత్తు వీడాలని హెచ్చరించారు.

## పిల్లలపై ఒట్టేసి చెప్పు.. కవితకు తీన్మార్ మల్లన్న బహిరంగ సవాల్

కల్వకుంట్ల కవిత కొత్తగా ఏర్పాటు చేసిన 'తెలంగాణ రాష్ట్ర సేన' (టీఆర్ఎస్) పార్టీపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సంచలన ఆరోపణలు చేశారు. ఈ పార్టీ ఏర్పాటు వెనుక సీఎం రేవంత్ రెడ్డి హస్తం ఉందని, బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా ఖతం చేయడమే లక్ష్యంగా ఈ రాజకీయ వ్యూహం పన్నారని వ్యాఖ్యానించారు. కవిత మాట్లాడే ప్రతి మాట వెనుక రేవంత్ రెడ్డి రాసిన స్క్రిప్ట్ ఉందని, ఆమె పార్టీ కార్యక్రమాలకు అవసరమైన నిధులను కూడా ఆయనే సమకూరుస్తున్నారని మల్లన్న ఆరోపించారు. ఈ సందర్భంగా కవితకు మల్లన్న నేరుగా సవాల్ విసిరారు. "మొన్న జరిగిన మంత్రివర్గ విస్తరణలో వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్, వివేక్‌లతో పాటు నాలుగో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాల్సింది మీరే కదా? ఈ విషయం నిజమో? కాదో? మీ పిల్లలపై ఒట్టేసి చెప్పాలి" అని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరి మంత్రి పదవి పొందేందుకు కవిత ప్రయత్నించారని, ఈ విషయం కేసీఆర్, కేటీఆర్‌లకు తెలియడంతోనే ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని మల్లన్న వివరించారు. ఇప్పుడు దానిని 'ఆత్మగౌరవ పోరాటం'గా చిత్రీకరించడం హాస్యాస్పదమని విమర్శించారు. "బీఆర్ఎస్ పార్టీని మోసం చేసి మీరు కాంగ్రెస్‌తో చేతులు కలిపారు. మంత్రిగా మారటానికి వేసిన కుట్ర విఫలమైంది. ఇప్పుడు తెలంగాణ వాదం పేరుతో డ్రామాలు ఎందుకు? ఏఐసీసీలోని ఓ కీలక నేతతో మీరు టచ్‌లో ఉన్న మాట వాస్తవం కాదా?" అని మల్లన్న ప్రశ్నించారు. కేసీఆర్‌ను 'మర మనిషి' అంటూ కవిత చేసిన విమర్శలను ప్రస్తావిస్తూ, ఆయన వదిలేసిన తెలంగాణ ఆత్మను కాపాడతామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.





ప్రస్తుతం తీన్మార్ మల్లన్న చేసిన ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. బీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకు కాంగ్రెస్, కవిత కలిసి ఈ నాటకం ఆడుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలు, సవాళ్లపై కవిత, ఆమె కొత్త పార్టీ నేతలు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

## పోరాటాలు చేసి దిల్లీ మెడలు వంచిన పార్టీ బీఆర్ఎస్: కేటీఆర్

హైదరాబాద్: అడుగడుగునా పోరాటాలు చేస్తూ దిల్లీ మెడలు వంచిన పార్టీ బీఆర్ఎస్ అని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. పదేళ్ల పాలనలో మాజీ సీఎం కేసీఆర్.. రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలబెట్టారన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన పార్టీ జెండా ఎగురవేశారు. కాంగ్రెస్, భాజపా పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పించి..మళ్లీ బీఆర్ఎస్‌ను పట్టాలెక్కించేందుకు పోరాటం చేస్తామని వెల్లడించారు. 14 ఏళ్లపాటు తెలంగాణ కోసం కేసీఆర్ పోరాటం



చేశారని, రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు పార్టీ పునరంకితమవుతుందని అన్నారు.



## డిప్యూటీ సీఎం సీపీఆర్‌వో గుండెపోటుతో మృతి

హైదరాబాద్: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మారబోయిన మధుసూదన్ గుండెపోటుతో మృతి చెందారు. అపోలో స్పెక్ట్రా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి వంటి సంస్థల్లో ఆయన సీనియర్ జర్నలిస్టుగా కీలక బాధ్యతలను నిర్వర్తించారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. మధుసూదన్ మృతి పట్ల ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిజాయతీ గల పాత్రికేయుడిని కోల్పోవడం బాధాకరంగా ఉందన్నారు. మధుసూదన్ ఆకస్మిక మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన హఠాన్మరణం తీవ్రంగా కలచివేసిందన్నారు.

# భాజపాలో ఆప్ ఎంపీల విలీనానికి గ్రీన్ సిగ్నల్



దిల్లీ: రాజ్యసభలో భాజపాలో ఏడుగురు ఆప్ ఎంపీల విలీనానికి రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ అధికారికంగా ఆమోదం తెలిపారు. ఈ పరిణామంతో రాజ్యసభలో భాజపా బలం 113కు చేరింది. మరోవైపు ఆప్ బలం మూడుకు పడిపోయింది. రాఘవ్ చద్దా, హర్భజన్ సింగ్, స్వాతి మాలీవాల్ సహా ఏడుగురు ఆప్ రాజ్యసభ సభ్యులు ఇటీవల ఒకేసారి భాజపాలోకి ఫిరాయించిన విషయం తెలిసిందే. వారంతా ప్రస్తుతం భాజపాలో విలీనమయ్యారు. విలీనం తర్వాత తమను భాజపా ఎంపీలుగానే పరిగణించాలని కోరుతూ ఈ ఏడుగురు ఎంపీలు రాజ్యసభ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించగా.. తాజాగా దానిని ఆయన ఆమోదించారు. రాజ్యసభ అధికారిక వెబ్‌సైట్ ప్రకారం.. ఈ ఏడుగురు ఎంపీలు ఇప్పుడు భాజపా సభ్యుల జాబితాలో ఉన్నారు. కాగా పార్టీ మారిన ఈ ఏడుగురు ఎంపీల సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆప్ ఆదివారం రాజ్యసభ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించింది. కొన్నేళ్లుగా ఆప్ దేశం కోసం కాకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేస్తోందని అందులో నుంచి బయటకు వచ్చిన ఎంపీలు పేర్కొన్నారు. అందులో ఉంటే సరైన పార్టీలో ఉన్న భావన తమలో లేకపోవడంతోనే ఆప్‌నకు దూరమై, ప్రజలకు దగ్గరవుతున్నామని అన్నారు. రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా రాజ్యసభలో ఆప్‌నకు చెందిన మూడింట రెండొంతుల మంది సభ్యులమైన తాము భాజపాలో విలీనం కావాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు.

## బంగ్లాదేశ్‌కు భారత హైకమిషనర్‌గా
# మాజీ కేంద్రమంత్రి దినేశ్ త్రివేది


న్యూఢిల్లీ: భాజపా నేత, కేంద్ర మాజీ మంత్రి దినేశ్ త్రివేది బంగ్లాదేశ్‌కు భారత తదుపరి హైకమిషనర్‌గా నియమితులయ్యారు. ఈ విషయాన్ని విదేశాంగ మంత్రిత్వ శాఖ (MEA) వెల్లడించింది. త్వరలోనే ఆయన ఈ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని తెలిపింది. యూరోపియన్ యూనియన్‌కు భారత రాయబారిగా బ్రస్సెల్స్‌కు వెళ్లనున్న ప్రణయ్ వర్మ స్థానంలో త్రివేది నియమితులయ్యారు. ఇటీవల బంగ్లాదేశ్‌తో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించడానికి కృషి చేస్తున్న తరుణంలో ఈ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది. త్రివేది 1980-1990 వరకు కాంగ్రెస్‌లో పని చేశారు. ఆ తర్వాత 1990లో జనతా దళ్‌లో చేరి 1998 వరకు ఆ పార్టీలో ఉన్నారు. 1998-2021 వరకు ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్‌లో ఉన్నారు. అనంతరం మార్చి 2021లో భాజపాలో చేరారు. 2009 -2011 వరకు యూపీఏ ప్రభుత్వంలో



ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రిగా సేవలందించారు. 2009 2019 వరకు లోక్‌సభ సభ్యుడిగా.. పలుమార్లు రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. 2011-2012 మధ్య కేంద్ర రైల్వే మంత్రిగా ఉన్నారు.

# బిర్యానీ, పుచ్చకాయ తిని.. ఒకే కుటుంబంలో నలుగురి మృతి

ముంబయి : మహారాష్ట్రలోని ఓ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బంధువులతో కలిసి బిర్యానీ, పుచ్చకాయ తిని కొన్ని గంటల్లోనే తీవ్ర అస్వస్థతకు గురై.. 12 గంటల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడ్డారు. వీరిలో 13 ఏళ్ల బాలిక కూడా ఉంది. ఫుడ్ పాయిజనింగ్ జరగడంతో వీరు మరణించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముంబయి లోని పైధోనీలో అబ్దుల్లా అబ్దుల్ కాదర్ (40) మొబైల్ దుకాణం నిర్వహిస్తున్నారు. అతడి భార్య నస్రీన్ (35). ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. శనివారం రాత్రి బంధువులు నిర్వహించిన విందులో అబ్దుల్లా కుటుంబం పాల్గొనింది. అక్కడ బిర్యానీని ఆరగించారు. అనంతరం ఇంటికి చేరుకున్నాక అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పుచ్చకాయ తిన్నారు. ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో ఆ కుటుంబంలోని అందరికీ





వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. వెంటనే అబ్దుల్లా స్థానికంగా ఉన్న డాక్టర్‌ని పిలిచారు. కానీ అప్పటికే వారి పరిస్థితి విషమంగా మారింది. దీంతో కుటుంబాన్ని స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం చికిత్స పొందుతూ ఉదయం 10 గంటల సమయంలో నలుగురూ మృతిచెందారు. దీంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. ఫుడ్ పాయిజనింగ్ కారణం అయ్యుండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.

# లద్దాఖ్‌లో ఐదు కొత్త జిల్లాలు.. కేంద్రం నోటిఫికేషన్‌కు ఎల్‌జీ ఆమోదం

కేంద్రపాలిత ప్రాంతం లద్దాఖ్‌లో ఐదు కొత్త జిల్లాలు ఏర్పాటుకానున్నాయి. ఈ మేరకు లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రకటించారు. వీటి ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌కు ఆమోదం తెలిపినట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఇదొక చరిత్రాత్మక రోజు అని అభివర్ణించారు. ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని పేర్కొన్నారు. అలాగే కొత్త జిల్లాల పేర్లను వెల్లడించారు. అవి.. జన్‌స్కర్, ద్రాస్, షామ్, నుబ్రా, చాంగ్‌థాంగ్.



ఇప్పటికే లేహ్, కార్గిల్ రెండు జిల్లాలు ఉన్నాయి. వీటితో కలిపి జిల్లాల సంఖ్య ఏడుకు పెరగనుంది. వీటి ఏర్పాటుతో పరిపాలనా సౌలభ్యం పెరగడంతో పాటు వృద్ధి, ఉపాధికి కొత్త మార్గాలు ఏర్పడనున్నాయని సక్సేనా తెలిపారు. 2019లో ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత జమ్మూకశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించిన సంగతి తెలిసిందే. శాసనసభ లేని కేంద్రపాలిత ప్రాంతంగా లద్దాఖ్ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పాలనలో ఉంది.



# భారతీయ సిబ్బంది ఉన్న నౌకపై ఇరాన్ దాడి


న్యూఢిల్లీ: ఒమన్ తీర సమీపంలో భారతీయ సిబ్బందితో వెళ్తున్న నౌకపై ఇరాన్ కోస్ట్‌గార్డ్ దళాలు కాల్పులు జరిపాయి. ఈ విషయాన్ని కేంద్ర ఓడరేవులు, నౌకా రవాణా, జలమార్గాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. టోగో దేశ జెండాతో వెళ్తున్న ఎంటీ సిరాన్ అనే చమురు నౌకపై శనివారం ఈ దాడి జరిగినట్లు తెలిపింది. ఇతర నౌకలతో పాటు ఎంటీ సిరాన్ కలిసి ప్రయాణిస్తుండగా ఇరాన్ తీర రక్షకదళం దానిని అడ్డగించి, హెచ్చరికగా పలు రౌండ్ల కాల్పులు జరిపినట్లు పేర్కొంది. అక్కడి పరిస్థితులను పర్యవేక్షించడానికి విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (MEA), భారత రాయబార కార్యాలయాలు అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. నౌకలోని సిబ్బంది సురక్షితంగా ఉన్నట్లు వెల్లడించింది. అయితే ఎంతమంది ఉన్నారనే విషయంపై స్పష్టత లేదు.

# 'బిడ్డను కని.. ఇప్పుడు అత్యాచారం అంటున్నారు': సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

సహజీవన బంధాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పరస్పర అంగీకారంతో ఏర్పడిన ఆ బంధం వీగిపోయిన తర్వాత అది లైంగిక దాడి ఎలా అవుతుందని ప్రశ్నించింది. ఒక బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత తన సహజీవన భాగస్వామిపై ఓ మహిళ వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, లైంగిక దాడికి పాల్పడ్డాడని తన సహజీవన భాగస్వామిపై ఆరోపణలు చేస్తూ ఓ మహిళ సుప్రీంకోర్టు (Supreme Court)ను ఆశ్రయించింది. పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న కీలక వ్యాఖ్యలు చేశారు. పరస్పర అంగీకారంతో ఏర్పడిన సహజీవన బంధాలు, లైంగిక దాడులకు మధ్య ఉన్న వ్యత్యాసం గురించి ప్రస్తావించారు. "ఈ కేసు సహజీవన బంధానికి సంబంధించినది. వివాహం కాకుండానే ఆ మహిళ ఒక బిడ్డకు కూడా జన్మనిచ్చింది. ఇప్పుడు ఆమె దాడి, అత్యాచారం అంటోంది. ఇదంతా ఏంటి..? సమ్మతితో ఏర్పడిన బంధం చివరకు దాడిగా ఎలా మారింది..? కొన్నేళ్లపాటు కలిసి ఉన్న ఆ మహిళ ఇప్పుడు ఫిర్యాదు చేస్తున్నారు. పెళ్లి ప్రస్తావన లేకుండా ఏర్పడిన బంధాల్లో ఉన్న సమస్యలు ఇవి" అని న్యాయమూర్తి అభిప్రాయం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది మాట్లాడుతూ.. "నిందితుడు ఆ మహిళను కలిసినప్పుడు ఆమె వయసు 18. అప్పుడు



ఆమె ఒక వితంతువు. అతడికి కూడా అప్పటికే పెళ్లి అయింది. ఆ విషయాన్ని దాచిపెట్టి అతడు సంబంధాన్ని కొనసాగించాడు. ఇతర మహిళలను ఇలాగే మోసగించాడు" అని వాదనలను వినిపించారు. "ఆమె పెళ్లి చేసుకోవడానికి బదులుగా కలిసి జీవించడానికి ఎందుకు అంగీకరించింది" అని న్యాయమూర్తి ఈ సందర్భంగా ప్రశ్నించారు. అలాగే ఆ మహిళ పరిస్థితిపై సానుభూతి వ్యక్తంచేశారు. ఆ బిడ్డ పోషణ కోసం భరణం కోరవచ్చని సూచించారు. "వివాహేతర సంబంధాలు ఉండొచ్చు. కానీ అలాంటి బంధాల వల్ల జన్మించిన పిల్లలు వివాహేతర సంతానం కాదు. పెళ్లి జరిగి ఉంటే.. చట్టపరంగా ఆమె పరిస్థితి మెరుగ్గా ఉండేది" అని వ్యాఖ్యానించారు. ఇరువర్గాలు ఈ సమస్యను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.



# పట్టాలు తప్పిన
# ముంబయిషోలాపూర్ వందే భారత్ రైలు

పుణె: ముంబయి షోలాపూర్ వందే భారత్ రైలు పట్టాలు తప్పింది. సోమవారం సాయంత్రం పుణె రైల్వే స్టేషన్‌కు సమీపిస్తున్న క్రమంలో ఓ కోచ్ పట్టాలు తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని అధికారులు వెల్లడించారు. రాత్రి 7.30గంటల సమయంలో ఈ రైలు (22225) ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ (సీఎస్ఎంటీ) నుంచి షోలాపూర్ వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. "వందే భారత్ రైలులోని బోగీ వీల్స్‌లో ఒకటి డైమండ్ క్రాసింగ్ వద్ద పట్టాలు తప్పింది. ఈ క్రాసింగ్‌ను యుద్ధ ప్రాతిపదికన మారుస్తున్నారు. ఈ ఘటనలో ప్రయాణికులు సురక్షితం" అని తెలిపారు. పట్టాలు తప్పిన బోగీలోని ప్రయాణికులు తమ సామగ్రితో పుణె రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు.

## రాష్ట్రీయ బాల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

దిల్లీ: ఏటా గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన బాలలకు ప్రకటించే 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్'లకు కేంద్ర ప్రభుత్వం నామినేషన్లను ఆహ్వానిస్తోంది. సాహసం, క్రీడలు, సామాజిక సేవ, శాస్త్ర, సాంకేతికత, పర్యావరణ, కళలు, సాంస్కృతిక రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన బాలలకు కేంద్ర మహిళ, శిశు అభివృద్ధిశాఖ ఏటా జాతీయ పురస్కారాలు అందిస్తూ వస్తోంది. ఐదేళ్ల పైబడి జులై 31 నాటికి 18 ఏళ్లు నిండని బాలలు ఎవరైనా ఈ అవార్డుకు జాతీయ అవార్డ్స్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో నామినేషన్లు పంపుకోవచ్చు. ఈ నామినేషన్లను బాలలు తామే స్వయంగా కానీ, వారి తరుఫున ఇతరులెవరైనా కానీ పంపొచ్చు. జులై 31 వరకు గడువు ఇచ్చారు. ఇతర వివరాల కోసం పోర్టల్‌ను సందర్శించొచ్చు.

# ఆ జడ్జి ఎదుట హాజరుకాను

**: కేజ్రీవాల్**

మద్యం కేసు విచారణ కోసం దిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఎదుట హాజరుకానని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. వ్యక్తిగతంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ కోర్టుకు హాజరుకావడానికి నిరాకరిస్తూ న్యాయమూర్తికి లేఖ రాశారు. హైకోర్టులో తనకు న్యాయం జరుగుతుందనే ఆశ లేదని.. అందుకే మహాత్మాగాంధీ సత్యాగ్రహ మార్గాన్ని అనుసరించాలని నిర్ణయించుకున్నానని లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట దీక్ష చేస్తానని వెల్లడించారు. బాగా ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నానని.. ఈ కేసులో జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేస్తానని కేజ్రీవాల్ పేర్కొన్నారు. జీవితంలో గెలుపు ఓటములతో సంబంధం లేని కొన్ని క్షణాలు



ఉంటాయి. అటువంటి సమయంలో కష్టమైన మార్గాన్ని ఎంచుకోవాలా, సులభమైన మార్గాన్ని ఎంచుకోవాలా అనే దానిపై తగిన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ రోజు నేను అదే దశలో ఉన్నాను. గతంలో నాపై తప్పుడు కేసులు పెట్టి.. జైలుకు పంపారు. కానీ చివరికి సత్యమే గెలిచింది. న్యాయస్థానం నన్ను నిర్దోషిగా ప్రకటించింది. కానీ సత్య మార్గం ఎప్పుడూ సులభం కాదు. మళ్లీ ఆ తీర్పు సీబీఐ జస్టిస్ స్వర్ణకాంత శర్మ ముందుకువచ్చింది. ఇక్కడ కేసు విచారణ నిష్పక్షపాతంగా, తటస్థంగా జరుగుతుందనే నమ్మకం నాకు లేదు' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

# భర్త చెల్లినే.. రెండో భార్యగా చూపించి షాకింగ్ ఘటన వెలుగులోకి

విడాకులు పొందేందుకు ఓ మహిళ వ్యవహరించిన తీరు షాక్‌కు గురిచేస్తోంది. ఎవరూ ఊహించని రీతిలో తన ఆడపడుచునే భర్తకు రెండో భార్యగా చూపి, ఏకపక్షంగా విడాకులు పొందింది. ఈ విషయం వెలుగులోకి రావడంతో భర్త మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించాడు. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. గ్వాలియర్‌కు చెందిన ఓ మహిళ 1998లో మార్కెటింగ్ కంపెనీలో పనిచేసే వ్యక్తిని వివాహం చేసుకుంది. అతడు వృత్తిరీత్యా తరచూ ఇంటికి దూరంగా ఉండాల్సి వచ్చేది. అదే దంపతుల మధ్య గొడవలకు కారణమైంది. గొడవలు తీవ్రరూపం దాల్చడంతో ఆమె 2015 నుంచి వేరుగా జీవిస్తోంది. అలాగే విడాకులు కావాలని ఎన్నిసార్లు అడిగినా.. అతడు మాత్రం నిరాకరించేవాడు. ఎట్టిపరిస్థితుల్లోను విడాకులు పొందాలని నిర్ణయించుకున్న ఆమె.. 2021లో గ్వాలియర్‌లోని ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. తన భర్త మళ్లీ పెళ్లి చేసుకున్నాడని తనకు విడాకులు ఇవ్వాలని కోరింది. ఆ క్రమంలో అతడు తన సోదరి, ఇతర బంధువులతో దిగిన ఫొటోలను కోర్టుకు చూపించింది. అతడు రెండో పెళ్లి చేసుకున్నాడని బుకాయించింది. ఆ ఫొటోను ఆధారంగా పరిగణించిన కోర్టు.. ఆమెకు విడాకులు మంజూరు చేసింది. వాస్తవంగా అతడి పక్కన నిల్చున్నది సొంత సోదరి కావడం గమనార్హం.

## ఒరాకిల్‌లో 20 వేల మంది లేఆఫ్..
### ఏఐ దెబ్బకు సీనియర్లు విలవిల




**న్యూఢిల్లీ:** దిగ్గజ టెకీ కంపెనీ ఒరాకిల్ కూడా లేఆఫ్స్ ప్రకటించింది. సుమారు 20 వేల మంది ఆ కంపెనీలో ఉద్యోగాలు కోల్పోనున్నారు. సోమవారం ఆ కంపెనీ ఈ ప్రకటన చేసింది. ప్రపంచవ్యాప్తంగా 20 నుంచి 30 వేల మందిని తొలిగించే అవకాశాలు ఉన్నట్లు చెప్పింది. ఇవాళ ఉదయం పంపిన ఈ-మెయిల్స్ ద్వారా ఈ విషయాన్ని ఉద్యోగులకు చేరవేశారు. అమెరికా, ఇండియా, కెనడా, లాటిన్ దేశాల్లో ఉన్న ఒరాకిల్ కంపెనీ ఉద్యోగులపై భారీ వేటు పడనున్నది. ఒరాకిల్ కంపెనీలో పనిచేస్తున్న సీనియర్లను కూడా తొలగిస్తున్నారు. 33 ఏళ్లుగా ఒరాకిల్ లో చేసిన సీనియర్ సెక్యూర్టీ ప్రొఫెషనల్ నీనా లివస్ కూడా తన ఉద్యోగాన్ని కోల్పోనున్నారు.

30 వేల మంది లేఆఫ్స్‌లో తాను కూడా ఉండబోనున్నట్లు ఆమె తన లింక్డిన్ ప్రొఫైల్‌లో రాశారు. తమ కంపెనీ తీసుకున్న నిర్ణయం షాకింగ్‌గా ఉన్నట్లు ఆమె చెప్పింది. కృత్రిమ మేధ ప్రభావం సీనియర్ల ఉద్యోగులపై పడుతున్నట్లు ఆమె తన పోస్టులో అభిప్రాయపడ్డారు. 1990లో లివిస్ ఆ కంపెనీలో చేరారు. డేటాబేస్, సెక్యూర్టీ ప్లాట్‌ఫామ్‌లపై ఆమె పనిచేశారు. ఇటీవల సెక్యూర్టీ అలర్ట్ మేనేజర్‌గా చేశారు. ఇంజినీరింగ్ , సెక్యూర్టీ టీమ్‌లతోనూ ఆమె పనిచేశారు. ఒరాకిల్ కంపెనీలో ప్రిన్సిపల్ ఎథికల్ హ్యాకర్, ప్రిన్సిపల్ సెక్యూర్టీ అనలిస్టుగా లివిస్ చేశారు. సీనియర్ ఉద్యోగులను టార్గెట్ చేసినట్లు భావిస్తున్నానని ఆమె తన పోస్టులో తెలిపారు. లేఆఫ్స్‌లో సంఖ్య కన్నా.. సీనియర్ల తొలగింపు ప్రశ్నార్ధకంగా మారింది. సుదీర్ఘకాలం కంపెనీలో పనిచేస్తున్నవారు, నైపుణ్యం కలిగిన ఉద్యోగులపై ప్రభావం పడడం శోచనీయంగా మారింది. ఇటీవల మెటా, మైక్రోసాఫ్ట్, డిస్నీ, ఏఎస్ఎంఎ కంపెనీలు కూడా లేఆఫ్స్ ప్రకటించాయి. మెటా, మైక్రోసాఫ్ట్ కంపెనీలు గత వారంలో 20 వేల ఉద్యోగులను తొలగించాయి. ప్రస్తుత దశలో చాలా వరకు కంపెనీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై భారీగా పెట్టుబడి పెడుతున్నాయి. పనివిధానాలను ఆటోమెట్ చేయడంలో కంపెనీలు నిమగ్నమయ్యాయి. వర్కింగ్ టీమ్స్‌ను పునర్ నిర్మిస్తున్నారు. అయితే అధిక సామర్థ్యం, తక్కువ ఇన్‌పుట్, ఎక్కువ లాభాలు అన్న రీతిలో కంపెనీలు పనిచేస్తున్నట్లు అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. లాభాలపై దృష్టి పెట్టిన కంపెనీలు.. భారీ వేతనపరులు అవసరమా అన్న రీతిలో ఆలోచిస్తున్నాయి. అయితే వీరి స్థానంలో ఏఐతో పాటు యువ ఉద్యోగులను నియమించేందుకు ఇష్టపడుతున్నట్లు తెలుస్తోంది. ఇక ఎంట్రీ లెవల్ జాబ్‌లను పూర్తిగా ఆటోమేట్ చేశారు. దీంతో కొత్తగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్నవారికి సమస్యలు మరింత అధికమవుతున్నాయి. టాప్ కంపెనీలన్నీ దాదాపు ఫ్రెషర్స్‌కు అవకాశాలు ఇవ్వడం లేదని సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రౌషన్ సింగ్ తెలిపారు. కేవలం అవసరాన్ని బట్టి హైరింగ్ జరుగుతోందన్నారు. మిడ్, సీనియర్ లెవల్ ఇంజినీర్లు సామర్థ్యాన్ని పెంచేందుకు ఏఐపై ఆధారపడుతున్నారని, దీని వల్ల సర్వీస్‌తో పాటు ప్రొడక్ట్ బేస్డ్ కంపెనీలు కొత్తవారికి ఉద్యోగాలు ఇవ్వలేకపోతున్నాయన్నారు. ఇక గతంలో సురక్షితమని భావించిన మేనేజర్, డైరెక్టర్ స్థాయి ఉద్యోగాలు ఇప్పుడు గ్యారెంటీ లేకుండా ఉన్నాయి. ప్రస్తుత దశలో ఒక్క కాలేజీ కూడా 100 శాతం ప్లేస్‌మెంట్ గ్యారెంటీ ఇవ్వడం లేదని గ్రేట్ లేక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ పీడీఎం డైరెక్టర్ డాక్టర్ పూర్ణిమా గుప్తా అభిప్రాయపడ్డారు. కొత్త గ్రాడ్యుయేట్లు అనుభవం కోసం చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తున్నట్లు చెప్పారు. కాస్ట్ కట్టింగ్ దశ నుంచి ఇప్పుడు ఏఐ ఫస్ట్ ఫ్యూచర్ అన్న రీతిలో కంపెనీలు ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఒరాకిల్ కంపెనీ ఎక్కువగా క్లౌడ్, ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై పెట్టుబడి పెడుతోంది. వర్క్‌ఫోర్స్‌ను రిడీజైన్ చేస్తున్నది. దీనిలో భాగంగానే సుదీర్ఘకాలం పనిచేసిన ఉద్యోగులను తొలగిస్తున్నారు. టెక్నాలజీకి పెద్దపీట వేయడంతో.. ఆటోమేషన్ పెరిగిపోయిందని, లాభాలపై దృష్టిపెట్టడం వల్లే లేఆఫ్స్ కూడా అధికంగా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

## భారత్-న్యూజిలాండ్ ఒప్పందం జోష్..
### భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లు

భారత్-న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఖరారు

భారీ లాభాలతో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

సెన్సెక్స్ 639, నిఫ్టీ 194 పాయింట్లు వృద్ధి

ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టవచ్చన్న వార్తలు

రూపాయి విలువ స్వల్పంగా బలపడి 94.16 వద్ద ట్రేడింగ్




**ముంబై:** దేశీయ, అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు వెల్లువెత్తడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ లాభాలతో ముగిశాయి. భారత్-న్యూజిలాండ్ మధ్య కీలకమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్ టీఏ) ఖరారు కావడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 639.42 పాయింట్లు లాభపడి 77,303.63 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 194.75 పాయింట్లు పెరిగి 24,092.70 వద్ద ముగిసింది.

కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, న్యూజిలాండ్ మంత్రి టాడ్ మెక్‌క్లే సమక్షంలో ఢిల్లీలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. దీని ప్రకారం, భారత్ నుంచి న్యూజిలాండ్‌కు వెళ్లే 100 శాతం ఎగుమతులపై సుంకాలు పూర్తిగా రద్దవుతాయి. అదేవిధంగా, న్యూజిలాండ్ నుంచి వచ్చే 95 శాతం దిగుమతులపై సుంకాలను గణనీయంగా తగ్గించడం లేదా పూర్తిగా తొలగించడం జరుగుతుంది.

మరోవైపు, ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టవచ్చనే వార్తలు కూడా మార్కెట్లకు ఊతమిచ్చాయి. వ్యూహాత్మకంగా కీలకమైన హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు ఇరాన్ ప్రతిపాదన చేసినట్లు వచ్చిన నివేదికలు ఇన్వెస్టర్లలో ఉత్సాహాన్ని నింపాయి.

సెన్సెక్స్-30 షేర్లలో అదానీ పోర్ట్స్, సన్ ఫార్మా, ఎన్టీపీసీ, టెక్ మహీంద్రా, టాటా స్టీల్ ప్రధానంగా లాభపడగా, యాక్సిస్ బ్యాంక్, బీఈఎల్, ట్రెంట్, ఐసీఐసీఐ బ్యాంక్ నష్టపోయాయి. బ్రాడర్ మార్కెట్లలో మిడ్‌క్యాప్ 1.55 శాతం, స్మాల్‌క్యాప్ 1.96 శాతం మేర లాభపడి బెంచ్‌మార్క్ సూచీలను మించి రాణించాయి. రంగాలవారీగా చూస్తే ఫార్మా, రియల్టీ, ఐటీ సూచీలు లాభపడగా, ప్రైవేట్ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ వెనుకబడ్డాయి.

విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీకి 24,300-24,400 స్థాయిల్లో కీలక నిరోధం ఎదురుకావచ్చు. తక్షణ మద్దతు 23,900 వద్ద ఉందని, ఈ స్థాయిని కోల్పోతే 23,800 వరకు దిగివచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇక రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 0.07 శాతం బలపడి 94.16 వద్ద ట్రేడ్ అయింది.

## టెక్నాలజీ వినియోగంతో యాక్సిస్ బ్యాంకులో తగ్గిన ఉద్యోగులు

**న్యూఢిల్లీ:** ప్రైవేట్ రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంకులో ఉద్యోగుల సంఖ్య స్వల్పంగా తగ్గింది. టెక్నాలజీపై పెట్టిన పెట్టుబడుల వల్ల కార్యకలాపాల్లో సామర్థ్యం పెరగడమే దీనికి కారణమని బ్యాంకు స్పష్టం చేసింది. డిజిటల్ సేవల వైపు దృష్టి సారించడం వల్ల సహజంగానే ఉద్యోగుల సంఖ్యలో ఈ మార్పు కనిపించిందని బ్యాంకు ఎండీ, సీఈవో అమితాబ్ చౌదరి విశ్లేషకులకు తెలిపారు. 2026 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరం నాటికి బ్యాంకులో ఉద్యోగుల సంఖ్య 1.01 లక్షలకు చేరింది. గతేడాది ఇదే సమయానికి ఇది 1.04 లక్షలుగా ఉండేది. అంటే, ఈ ఏడాదిలో సుమారు 3,000 మంది సిబ్బంది తగ్గారు. అయితే ఇది ఏ ఒక్క విభాగానికో పరిమితం కాలేదని, అన్ని విభాగాల్లోనూ ఈ మార్పు కనిపించిందని బ్యాంకు పేర్కొంది. ఉద్యోగుల సంఖ్య తగ్గినా, మరోవైపు బ్యాంకు తన కార్యకలాపాలను విస్తరిస్తోంది.

# వార్ వన్ సైడ్...

ఢిల్లీని ఓ చూపు చూసిన ఆర్సీబీ!

ఢిల్లీ క్యాపిటల్స్‌పై 9 వికెట్ల తేడాతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఘన విజయం

కేవలం 75 పరుగులకే కుప్పకూలిన ఢిల్లీ బ్యాటింగ్ లైనప్

హేజిల్‌వుడ్ 4, భువనేశ్వర్ 3 వికెట్లతో ఢిల్లీ పతనాన్ని శాసించారు

6.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి సత్తా చాటిన బెంగళూరు



**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) బౌలర్లు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టారగా, ఆపై బ్యాటర్లు దుమ్మురేపారు. మొత్తమ్మీద వార్ వన్ సైడ్ చేసేశారు. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో పూర్తి ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఆర్సీబీ 9 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించింది. ఆర్సీబీ పేసర్ల ధాటికి ఢిల్లీ బ్యాటింగ్ లైనప్ పేకమేడలా కూలిపోయింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ జట్టు కేవలం 75 పరుగులకే ఆలౌట్ కాగా, ఈ స్వల్ప లక్ష్యాన్ని ఆర్సీబీ కేవలం 6.3 ఓవర్లలోనే ఛేదించి భారీ



విజయాన్ని నమోదు చేసింది.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆర్సీబీ నిర్ణయం సరైనదని ఆ జట్టు పేసర్లు నిరూపించారు. జోష్ హేజిల్‌వుడ్ (4/12), భువనేశ్వర్ కుమార్ (3/5) స్వింగ్‌తో ఢిల్లీ బ్యాటర్లను ఉక్కిరిబిక్కిరి చేశారు. వీరి ధాటికి పవర్‌ప్లేలోనే ఢిల్లీ వెన్ను విరిగింది. ఒక దశలో 8 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి ఢిల్లీ పీకల్లోతు కష్టాల్లో పడింది.

ఈ క్లిష్ట పరిస్థితుల్లో అభిషేక్ పోరెల్ (30) కాస్త పోరాడటంతో ఢిల్లీ ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. డేవిడ్ మిల్లర్ (19) అతనికి కొద్దిసేపు సహకరించాడు. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమవడంతో ఢిల్లీ 16.3 ఓవర్లలో 75 పరుగులకు ఆలౌటైంది.

అనంతరం 76 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీ జాకబ్ బెథెల్ (20) వికెట్ మాత్రమే కోల్పోయింది. ఆ తర్వాత వచ్చిన దేవదత్ పడిక్కల్ (13 బంతుల్లో 34 నాటౌట్), విరాట్ కోహ్లీ (15 బంతుల్లో 23 నాటౌట్)తో కలిసి మరో వికెట్ పడకుండా లాంఛనాన్ని పూర్తి చేశాడు. పడిక్కల్ 3 ఫోర్లు, 3 సిక్సర్లతో చెలరేగి మ్యాచ్‌ను వేగంగా ముగించాడు.


## 15 ఏళ్ల క్రితం నాటి ధోనీ రికార్డును బ్రేక్ చేసిన రింకూ సింగ్



**లక్నో:** లక్నో సూపర్ గెయింట్స్‌తో ఆదివారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో.. కోల్‌కతా నైట్ రైడర్స్ సూపర్ విక్టరీ కొట్టిన విషయం తెలిసిందే. తొలుత ఆ రెండు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ టై కాగా, ఆ తర్వాత సూపర్ ఓవర్‌లో కోల్‌కతా మెరిసింది. ఈ మ్యాచ్‌లో కోల్‌కతా బ్యాటర్ రింకూ సింగ్ అద్భుతంగా రాణించాడు. ఈ క్రమంలో అతను ఓ అరుదైన రికార్డును బ్రేక్ చేశాడు. ఈ మ్యాచ్‌లో రింకూ సింగ్ 51 బంతుల్లో 83 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. అయితే ఆరవ నెంబర్ బ్యాటర్‌గా బరిలోకి దిగిన రింకూ సింగ్ చాలా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక రన్స్ చేసిన ఆరో నెంబర్ బ్యాటర్‌గా రింకూ నిలిచాడు. గతంలో చెన్నై ప్లేయర్ ఎంఎస్ ధోనీ పేరిట ఆ రికార్డు ఉన్నది. 2011 ఐపీఎల్ సీజన్‌లో ధోనీ ఆర్సీబీతో మ్యాచ్‌లో ఆరో నెంబర్ బ్యాటర్‌గా బరిలోకి దిగి 40 బంతుల్లో 70 రన్స్ స్కోరు చేశాడు. ఇప్పుడు అత్యధిక రన్స్ స్కోరు చేసిన ఆరో నెంబర్ బ్యాటర్‌గా రింకూ హిస్టరీ క్రియేట్ చేయడం విశేషం.

ఆదివారం లక్నో సూపర్ జెయింట్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ మధ్య లక్నోలో జరిగిన లోస్కోరింగ్ థ్రిల్లర్ అభిమానులను అలరించింది. ఇరుజట్ల స్కోర్లు సమం కావడంతో ఈ సీజన్‌లో జరిగిన తొలి సూపర్ ఓవర్‌లో కోల్‌కతానే విజయం వరించింది. కేకేఆర్ నిర్దేశించిన 156 పరుగుల స్వల్ప ఛేదనలో లక్నో సైతం నిర్ణీత ఓవర్లలో అంతే స్కోరు (155/8) చేయడంతో మ్యాచ్ టై అయింది. సూపర్ ఓవర్‌లో లక్నో.. నరైన్ మాయ చేయడంతో ఒక్కటంటే ఒక్కటే పరుగు చేసింది. రింకూ తొలి బంతికే ఫోర్ బాది కోల్‌కతాకు రెండో విజయాన్ని అందించాడు. మొదట మోహ్సిన్ ఖాన్ (5/23) పేస్‌కు దాసోహమైన కేకేఆర్.. 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 155 రన్స్ చేసింది. ప్రధాన బ్యాటర్లంతా నిరాశపరిచినా లోయరార్డర్‌లో రింకూ సింగ్ (51 బంతుల్లో 83 నాటౌట్, 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) పోరాడి ఆ జట్టును పోటీలో నిలిపాడు.

## కేకేఆర్ బ్యాటర్ రఘువంశీకి భారీ ఫైన్, డీమెరిట్ పాయింట్



**లక్నో:** కోల్‌కతా నైట్ రైడర్స్ బ్యాటర్ అంగ్‌క్రిష్ రఘువంశీకి భారీ జరిమానా పడింది. లక్నోతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో అతను ఫీల్డింగ్‌కు అడ్డుపడినట్లు తేలింది. ఆ మ్యాచ్ 5వ ఓవర్‌లో మిడాన్ దిశగా బంతిని కొట్టి పరుగు కోసం వెళ్లాడు. అయితే నాన్‌స్ట్రయికర్ అతన్ని తిప్పిపంపాడు. ఆ క్రమంలో వికెట్ల వైపు పరుగెత్తిన రఘువంశీ.. ఫీల్డర్ బంతిని త్రో చేస్తున్న దిశలో పరుగెత్తాడు. దీంతో థార్డ్ అంపైర్ కేకేఆర్ బ్యాటర్‌ను ఔట్‌గా ప్రకటించాడు. ఫీల్డింగ్‌కు అడ్డుపడినట్లుగా పేర్కొన్నారు. అయితే మ్యాచ్ ఫీజులో 20 శాతం జరిమానా విధించారు. రఘువంశీకి ఓ డీమెరిట్ పాయింట్ కూడా జతకలిసింది. ఈ ఏడాది ఐపీఎల్‌లో ఈ రకంగా ఔటైన తొలి ప్లేయర్ రఘువంశీ. ఐపీఎల్ లెవల్ 1 నేరంగా పరిగణించారు. ఆటగాళ్ల ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.2 ఉల్లంఘించినట్లు ఐపీఎల్ ఓ ప్రకటనలో చెప్పింది. ఔటై వెనుదిరిగి వెళ్తున్న సమయంలో.. రఘువంశీ బౌండరీ రోప్‌ను తన బ్యాట్‌తో బలంగా కొట్టాడు. ఆ తర్వాత అతను తన హెల్మెట్ తీసి కోపంతో డగౌట్ వైపు విసిరేశాడు. ఫీల్డర్‌కు అడ్డుపడడమే కాకుండా, అనుచితంగా ప్రవర్తించినందుకు రఘువంశీకి ఫైన్ వేశారు. నేరాన్ని అంగీకరించిన రఘువంశీ .. మ్యాచ్ రిఫరీ విధించిన ఆంక్షలును కూడా ఆమోదించాడు.

# భారత షట్లర్ల దూకుడు..

### క్వార్టర్ ఫైనల్లో భారత్..!




**న్యూఢిల్లీ:** థామస్ కప్‌లో భారత్ షట్లర్లు అదరగొట్టారు. పురుషుల సింగిల్స్‌లో ఆయుశ్ శెట్టి , డబుల్స్‌లో సాత్విక్ -- చిరాగ్ ద్వయం చెలరేగడంతో ఆస్ట్రేలియాపై భారత జట్టు ఘన విజయం సాధించింది. సోమవారం సెకండ్ గ్రూప్ ఏ టై మ్యాచ్‌లో ఆసీస్‌ను 5-0తో మట్టికరిపించి క్వార్టర్ ఫైనల్లో అడుగు పెట్టింది. ప్రస్తుతం గ్రూప్ ఏ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతున్న భారత్ తర్వాతి మ్యాచ్‌లో చైనాను ఢీకొట్టనుంది.

ఇటీవల సూపర్ ఫామ్‌లో ఉన్న యువకెరటం ఆయుశ్ శెట్టి వరస సెట్లలో శ్రేయ్ ధాండ్‌ను చిత్తు చేశాడు. ప్రత్యర్థిని వణికించిన ఆయుశ్ 21-8, 21-6తో గెలుపొందడంతో భారత్ ఆధిక్యంలోకి వెళ్లింది. అనంతరం డబుల్స్‌లో సాత్విక్ చిరాగ్‌లు 21-14, 21-16తో రిజ్కీ హిదాయత్, జాక్ యూను చిత్తు చేశారు. ప్రణయ్ సైతం జోరు చూపిస్తూ రిషి హోండా భూపతిపై 21-11, 21-17తో విజయం సాధించాడు.

### తొలి రెండు స్థానాల్లో

డెన్మార్క్ వేదికగా ఆద్యంతం హోరాహోరీగా జరుగుతున్న థామస్ కప్‌లో నాలుగు గ్రూపుల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. గత మ్యాచుల్లో ఆస్ట్రేలియాను 5-0తో ఓడించిన చైనా సోమవారం కెనడాపై 4-1తో గెలుపొందింది. గత సీజన్ క్వార్టర్ ఫైనల్లో చైనా చేతిలో భారత్ కంగుతిన్నది. ఈసారి ఆ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలన టీమిండియా పట్టుదలతో ఉంది.

MOVIE TIME

## కార్తీతో బోయపాటి మూవీ

### చిత్రపరిశ్రమలో పుకార్ల షికారు



**టాకీస్:** టాలీవుడ్‌లో 'మాస్ సినిమాల చిరునామా'గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బోయపాటి శ్రీను, స్క్రీన్ మీద హీరోని ఎంత పవర్‌ఫుల్‌గా చూపించవచ్చో, విలన్‌ను ఎంత భయంకరంగా సృష్టించవచ్చో.. బోయపాటి సినిమాలను చూస్తే అర్థమవుతుంది. కేవలం ఫైట్లు, రక్తం మాత్రమే కాకుండా, ప్రేక్షకుడి నరాల్లో రక్తం ఉడికేలా చేసే హై-వోల్టేజ్ ఎలివేషన్లు ఆయన సొంతం. ఒక సాధారణ కథను కూడా తనదైన మేకింగ్ స్టైల్‌తో వెండితెరపై ఒక విజువల్ వండర్‌గా మార్చడంలో ఆయన దిట్ట. మొదటి సినిమా నుండి మొన్నటి 'అఖండ-2' వరకు ఆయన ఎంచుకునే యాక్షన్ సీక్వెన్స్, డైలాగ్ డెలివరీలో ఒక ప్రత్యేకమైన 'బోయపాటి మార్క్' స్పష్టంగా కనిపిస్తుంది. అయితే, అఖండ-2 తర్వాత ఆయన ఎవరితో జతకట్టబోతున్నారనే విషయంపై గత కొద్ది రోజులుగా ఇండస్ట్రీ వర్గాల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. మొదట ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో సరైనోడు-2 సినిమా ఉంటుందని ప్రచారం జరిగినప్పటికీ, వివిధ కారణాల వల్ల అది పట్టాలెక్క లేదు. ఆ తర్వాత బాలీవుడ్ హీరోలతో సినిమా ఉ ంటుందని వార్తలు వచ్చినా, అవి కేవలం పుకార్లుగానే మిగిలిపోయాయి. తాజాగా, కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ పేరు తెరపైకి రావడంతో సినీ ప్రియుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. తెలుగు, తమిళ భాషల్లో మంచి ఫ్యాన్ బేస్ ఉన్న హీరో కార్తీ కి మాస్ యాక్షన్ సినిమాలంటే మక్కువ ఎక్కువే. మరోవైపు బోయపాటి శ్రీను తనదైన శైలిలో హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాలను వెండితెరపై ఆవిష్కరించడంలో దిట్ట. వీరిద్దరి కలయికలో సినిమా వస్తుందనే వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో 'టాక్ ఆఫ్ ది టౌన్'గా మారింది. కార్తీ ఇమేజ్‌కు సరిపడే పక్కా మాస్ కథను బోయపాటి ఇప్పటికే సిద్ధం చేశారని, ఈ ప్రాజెక్ట్ గనుక ఓకే అయితే సౌత్ ఇండియాలో ఇదొక భారీ క్రేజీ కాంబినేషన్ అవుతుందని ఇన్‌సైడ్ టాక్ వినిపిస్తోంది. సాధారణంగా బోయపాటి సినిమాల్లో హీరోల ఎలివేషన్స్, యాక్షన్ సీక్వెన్స్ పీక్స్‌లో ఉంటాయి.

## ధనుష్‌తో మరోమారు వెంకీ అట్లూరి జత



**టాకీస్:** తమిళ నటుడు ధనుష్‌తో 'సార్' సినిమా తీసి విజయం అందుకున్నారు తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య బంధం బలపడింది. ధనుష్ నటించిన ఏ సినిమా తెలుగులో విడుదలైనా వెంకీ అట్లూరి ప్రమోషన్స్‌లో భాగమవుతున్నారు. 'సార్' కాంబినేషన్‌లో మరో సినిమా వస్తుందని చాలాకాలంగా టాక్ నడుస్తోంది. ఈ రూమర్స్ నిజమేనని స్పష్టమైంది. హైదరాబాద్‌లో జరిగిన 'కర' ప్రీరిలీజ్ ఈవెంట్‌కు వెంకీ అట్లూరి గెస్ట్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధనుష్ వెంకీని ఉద్దేశించి మాట్లాడుతూ 'చివరి నిమిషంలో పిలిచినా వచ్చినందుకు థ్యాంక్స్. మీరు నాకు బ్రదర్‌లాంటివారు. 'సార్' లాంటి మంచి చిత్రాన్ని నాకు ఇచ్చారు. 'సార్' తర్వాత మీరో కథ నెరేట్ చేసి.. అదృశ్యమయ్యారు. ఆ కథను సంపూర్ణంగా తీసుకురండి. సినిమా చేయడానికి నేను రెడీగా ఉన్నా. మీ సక్సెస్‌కు చాలా ఆనందిస్తున్నా. మీ గత చిత్రం 'లక్కీ భాస్కర్' చాలా నచ్చింది.

# ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్

### సాయిపల్లవి కాదు కాదు...రుక్మిణీ వసంత్




టాకీస్: జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి రూపొందించబోతున్న సంగీత సామ్రాజ్ఞి ఎమ్మెస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌లో సాయిపల్లవి నటించబోతోందనే వార్త కొంతకాలంగా మీడియాలో చక్కర్లు కొడుతోంది. అలానే ఆమె పేరుతో పాటు నయనతార పేరు కూడా ఆ మధ్య వినిపించింది. అలా మరో ఇద్దరు ముగ్గురి పేర్లనూ ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాత్రతో ముడి పెట్టి కొందరు ప్రచారం చేశారు. అయితే ఫైనల్‌గా సాయిపల్లవి దగ్గరే అది ఆగింది. కానీ ఇప్పుడు ఆ పాత్ర సాయి పల్లవి చేజారి... రుక్మిణీ వసంత్ ను చేరిందని వార్తలు వస్తున్నాయి. సాయిపల్లవికి ఈ పాత్ర చేయాలనే కోరిక బలంగా ఉన్నా... ఇప్పటికే ఆమె కమిట్ అయిన సినిమాల కారణంగా డేట్స్ అడ్జస్ట్ చేయలేక ఈ పాత్రను వదిలేసుకుందని అంటున్నారు. ఇదిలా ఉంటే... పలు కన్నడ, తెలుగు సినిమాలతో ఇప్పటికే దక్షిణాది సినీ అభిమానుల గుండెల్లో చోటు దక్కించుకున్న రుక్మిణి వసంత్ ఎమ్మెస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌లో నటిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. 'కాంతార: చాప్టర్ 1'తో రుక్మిణీ వసంత్ సైతం జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం ఆమె యశ్ మూవీ 'టాక్సిక్'లో నటిస్తోంది. అలానే ప్రభాస్ సరసన 'డ్రాగన్' చేస్తోంది. తమిళంలోనూ ధనుష్ మూవీలో రుక్మిణీ వసంత్ ఎంపికైందని వార్తలు వచ్చాయి. కెరీర్ మంచి ఊపు మీద ఉన్న ఈ సమయంలో ఆమె ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాత్రను చేస్తే ఖచ్చితంగా అది ప్రాజెక్ట్‌కు ఉపయోగపడే అంశమే! అయితే రుక్మిణీ వసంత్ ఎమ్మెస్ సుబ్బులక్ష్మిగా నటించబోతోందనే విషయాన్ని ఇంకా అధికారికంగా మేకర్స్ ప్రకటించలేదు.



**టాకీస్:** రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన 'కల్కి చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేసి వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. పురాణాల ఆధారంగా భవిష్యత్ నేపథ్యంలో సాగిన ఈ సినిమా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'కల్కి 2'ను మరింత భారీ స్థాయిలో తీసుకురావడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. కథను మరింత లోతుగా, భావోద్వేగపూర్వకంగా తీర్చిదిద్దేందుకు దర్శకుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సమాచారం. మొదటి భాగంలో చూపించిన ప్రపంచాన్ని విస్తరించి, కొత్త పాత్రలు, ఆసక్తికరమైన మలుపులతో సీక్వెల్‌ను రూపొందించాలని ప్లాన్ చేస్తున్నారు. తాజాగా వినిపిస్తున్న వార్తల ప్రకారం ఈ సీక్వెల్‌లో ఒక పవర్‌ఫుల్ స్పెషల్ పాత్ర ఉ ండబోతుందని, అది క్లైమాక్స్‌లో కీలకంగా మారుతుందని టాక్. ఆ పాత్ర కోసం తమిళ స్టార్ హీరో శింబును సంప్రదించినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆయన ఈ సినిమాలో నటిస్తే తమిళ మార్కెట్‌లో సినిమాకు మరింత బలం చేకూరే అవకాశముందని అంటున్నారు. మొదటి భాగం చివర్లో ప్రభాస్ పాత్రను కర్ణుడిగా చూపిస్తూ మేకర్స్ ఇచ్చిన ట్విస్ట్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. దీంతో సీక్వెల్‌పై ఆసక్తి మరింత పెరిగింది. ఈసారి కథ ప్రధానంగా కర్ణుడి గతం, అతని గాథ, తిరిగి రావడం వంటి అంశాలపై నడుస్తుందని సమాచారం. బాలీవుడ్ లెజెండ్ అమితాబ్ బచ్చన్ ఇప్పటికే షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఆయన మళ్లీ అశ్వత్థామ పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతుండగా, బిజీ షెడ్యూల్ కారణంగా అభిమానులను కలవలేకపోయానని ఆయన తెలిపారు. ప్రభాస్ కూడా త్వరలో

## శరవేగంగా కల్కి-2 షూటింగ్

### తమిళ నటుడు శింబు కూడా చేరినట్లు ప్రచారం



షూటింగ్‌లో చేరనున్నారని సమాచారం. ఇక మరో ముఖ్య ఆకర్షణగా కమల్ హాసన్ కూడా ఈ సీక్వెల్‌లో కనిపించనున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ చాలా ఏళ్ల తర్వాత మళ్లీ కలిసి నటిస్తుండడం విశేషం. ఇక ఈ సినిమాలో దుల్కర్ సల్మాన్, జేడీ చక్రవర్తి కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు సమాచారం. దీంతో 'కల్కి 2'కు భారీ తారాగణం సిద్ధమవుతోంది.

## చీన్ టపాక్ డుం డుం.. సినిమా టైటిల్

### గవిరెడ్డి శ్రీనివాస్ హీరోగా కొత్త చిత్రం

టాకీస్: చీన్ టపాక్ డుం డుం' అనే వినూత్నమైన టైటిల్‌తో ఓ కొత్త తెలుగు సినిమా ప్రారంభమైంది. 'శుభం' సినిమా, 'కుమారి శ్రీమతి' వంటి వెబ్ సిరీస్‌ల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న గవిరెడ్డి శ్రీనివాస్ ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు వినోదాన్ని పంచేలా ఉండనుందని చిత్ర బృందం చెబుతోంది. ఈ సినిమా ప్రారంభ కార్యక్రమం ఘనంగా జరిగింది. పలువురు సినీ ప్రముఖులు హాజరై యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ముహూర్తపు షాట్‌కు నటి సమంత క్లాప్ కొట్టగా, దర్శకుడు గోపిచంద్ మలినేని తొలి షాట్‌ను డైరెక్ట్ చేశారు. మల్లిడి వశిష్ట కెమెరా ఆన్ చేయగా, నందిని రెడ్డి, బీవీఎస్ రవి, గౌతమి కలిసి స్క్రిప్ట్‌ను అందించి చిత్రాన్ని ప్రారంభించారు. ఈ చిత్రాన్ని శ్రీను నాగులపల్లి 'విలేజ్ టాకీస్' బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇది ఆయనకు నిర్మాతగా తొలి సినిమా కావడం విశేషం. సినిమాకు వై.ఎన్ లోహిత్ దర్శకత్వం వహిస్తున్నారు. హీరోయిన్‌గా బ్రిగిడా సాగా నటిస్తుండగా, దువ్వాడ మాధురి ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. టెక్నికల్ టీమ్ విషయానికి వస్తే, ఆర్ట్ డైరెక్టర్‌గా ఏ.ఎస్. ప్రకాష్ పనిచేస్తున్నారు. సినిమాటోగ్రఫీ బాధ్యతలను



సెంథిల్ కుమార్ నిర్వహిస్తున్నారు. సంగీతాన్ని పీఆర్ మ్యూజిక్ అందిస్తుండగా, పాటలను తిరుపతి జావానా రాస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లేలను దివ్య తేజస్వి, విక్రమ్ కుమార్ కె, నాగ్ ట్రైల్‌బ్లేజర్, ఏకలవ్య కలిసి సిద్ధం చేశారు. ఇప్పటికే నర్సీపట్నం, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. ఆగస్టు నెలలో సినిమాను విడుదల చేయాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది.

## జూన్ 25న పెద్ది విడుదల ఖాయం

### దర్శకుడు సానా బుచ్చిబాబు వెల్లడి

టాకీస్: రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' చిత్రం విడుదలపై క్లారిటీ వచ్చింది. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన ఈ చిత్రం ఫైనల్‌గా జూన్ 25న విడుదల కానుందని రెండ్రోజులుగా వార్తలు హల్‌చల్ చేస్తున్న సంగతి తెలిసిందే! అయితే దీనిపై దర్శకుడు సాన బుచ్చిబాబు క్లారిటీ ఇచ్చారు. ధనుష్ హీరోగా నటించిన 'కర' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ఆయన అతిథిగా హాజరయ్యారు. అక్కడ 'పెద్ది రిలీజ్ ఎప్పుడు అని అభిమానులు గోల చేయగా బుచ్చి విడుదల తేదిని ప్రకటించారు. ఎట్టి పరిస్థితుల్లో జూన్ 25 సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని తెలిపారు. దీంతో అభిమానులు కాస్త ఊరట చెందారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో క్రీడా నేపథ్యంలో సాగే చిత్రమిది. ఇందులో చరణ్ సరసన జాన్వీకపూర్ నటిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన రెండు పాటలు దుమ్ము లేపేశాయి. త్వరలో ఓ డ్యూయెట్ రానుంది. ఆ తర్వాత శ్రుతీహాసన్, రామ్‌చరణ్‌పై చిత్రీకరిస్తున్న ప్రత్యేక గీతాన్ని విడుదల చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. షూటింగ్ ఆలస్య, పోస్ట్ ప్రొడక్షన్ పనులు సమయం సరిపోకపోవడం వల్ల విడుదల వాయిదా పడిన సంగతి తెలిసిందే.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.